తెరుచుకోని వారధి టెండర్లు

నరసాపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):వశిష్ఠ వారధి టెండర్లు 16వ సారి మళ్లీ వాయిదా పడ్డాయి. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 11న తెరవాలి. న్యాయపరమైన ఇబ్బందులతో వచ్చే నెల 12కి వాయిదా వేశారు. రూ.490కోట్లతో ఉభయ గోదావరి జిల్లాలను కలుపుతూ వంతెన నిర్మాణానికి 2023లో టెండర్లు పిలిచారు. రాజుల్లంక-రామేశ్వరాన్ని కలుపుతూ వారధి నిర్మాణానికి డిజైన్ రూపొందించారు. భూసేకరణలో కొందరు రైతులు కోర్టును ఆశ్రయించారు.

క్షయ నిర్మూలన దిశగా..



మరోసారి ఇంటింటా సర్వే.. వ్యాధి నిర్ధారణకు ప్రత్యేక పరీక్షలు

- **జిల్లాలో 1600 మంది రోగులు.. ఆరు నెలల వైద్యంతో టీబీ ఖతం**
- **మందులు ఉచితం.. పౌష్టికాహారానికి సాయం రూ.500 నుంచి వెయ్యికి పెంపు**

భీమవరం టౌన్, అక్టోబరు 26 : జిల్లా క్షయ వ్యాధి నివారణకు వైద్య ఆరోగ్య శాఖ నడుం బిగించింది. టీబీతో బాధపడుతున్న రోగులను గుర్తించేందుకు గ్రామాల వారీగా ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ఎంపీఎల్‌హెచ్ సిబ్బందితో సర్వే చేపట్టింది. 2027 నాటికి క్షయ వ్యాధిని పూర్తి స్థాయిలో నివారించాలని నిర్ణయించింది. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు చేపట్టిన సర్వేలో 43 వేల 432 మంది అనుమానితులకు క్షయ పరీక్షలు నిర్వహించింది. వీరిలో 2,624 మందికి వ్యాధి ఉన్నట్లు నిర్ధారించి ఆరు నెలలపాటు మందులు వాడించింది. ఇప్పటి వరకు 13 వందల మందికి వ్యాధి నుంచి విముక్తి పొందారు. ఇంకా 16 వందల మందికి మందులు అందించి వైద్యం అందిస్తున్నారు. మందులు వాడి కోర్సు పూర్తి చేస్తే వీరు కూడా టీబీ నుంచి బయటపడతారు. 2023లో లక్ష మందిలో 34 వేల 800 మందికి నమూనా పరీక్షలు చేయగా మూడు వేల 402 మందికి క్షయ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. వీరికి ఆరు నెలల కోర్సు వైద్యం అందించటంతో వారు పూర్తిగా ఆరోగ్యవంతులుగా మారారు. ఐతే వీరి ఆరోగ్యం పైన ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు.

ఉచిత వైద్యం.. సాయం పెంపు

జిల్లాలోని 27 కేంద్రాల్లో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక పరికరాల ద్వారా చేస్తున్న పరీక్షల ద్వారా ప్రాథమికంగానే వ్యాధిని గుర్తించే వీలు కలుగుతుంది. రోగి వాడే మందులు పనిచేస్తాయా ? లేదా ? అనేది తెలుస్తుంది. అందువల్ల రోగికి సరైన వైద్యం అందించే అవకాశం ఉంది. ఈ పరీక్షల న్నీ పూర్తి ఉచితం. క్షయ వ్యాధిగ్రస్తుల కు పౌష్టికాహారం తీసుకునేందుకు వీలు గా ప్రభుత్వం తరపున ఇప్పటి వరకు 500 రూపాయలు అందించేవారు. ఈ మొత్తం సరిపోకపోవడంతో దీనిని వెయ్యికి పెంచారు. వచ్చే నెల నుంచి ఈ మొత్తం రోగి ఖాతాలో జమ కానుంది.

క్షయ లక్షణాలు

- రెండు వారాలపాటు జ్వరం తగ్గదు. దగ్గు వస్తూ ఉంటుంది. ఆకలి మందగిస్తుంది. శరీర బరువు తగ్గుతుంది. ఇవి ప్రాథమిక లక్షణాలు.
- ఈ లక్షణాలు కనిపించిన వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదిస్తే ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారు.
- రోగ నిర్ధారణ అయిన వెంటనే కోర్సు ప్రారంభించి ఆరు నుంచి తొమ్మిది నెలలపాటు వైద్యం అందిస్తారు. మందులు ఇస్తారు. ఇవి పూర్తి ఉచితం.
- అలాగే మందులు చెప్పిన చెప్పిన సమయానికి సక్రమంగా వేసుకుంటున్నారో లేదో పరిశీలిస్తారు.
- క్షయ వ్యాధిగ్రస్తులు దగ్గు, తుమ్ముల ద్వారా ఇతరులకు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి వీరికి దూరంగా ఉండాలి.


ఇంటింటి సర్వే

నిధులివ్వలేం



పాలకవర్గాలు లేక పట్టణాల్లో నిలిచిపోనున్న ఆర్థిక సంఘం నిధులు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు పట్టణాలకు ఆనుకుని వున్న 17 గ్రామాలను విలీనం చేశారు. ఈ ప్రక్రియకు వ్యతిరేకంగా ఆయా గ్రామాల ప్రజలు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో స్టే విధించింది. ఫలితంగా ఎన్నికలు జరగలేదు. ఇదే ఇప్పుడు మునిసిపాలిటీలకు శాపంగా మారింది. పాలకవర్గాలు లేని కారణంగా ఆర్థిక సంఘం నిధులు మంజూరు కావడం లేదు. అభివృద్ధి నిలిచిపోనుంది.

- **భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు మున్సిపాలిటీల్లో నిలిచిపోనున్న అభివృద్ధి**
- **గ్రామాల విలీనంతో కోర్టుల్లో కేసుల కారణంగానే.. ఆగిన ఎన్నికల ప్రక్రియ**
- **ప్రభుత్వస్థాయిలో తర్జనభర్జన**



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా 30 మున్సిపాలిటీలకు ఇలా ఎన్నికలు లేకపోవడంతో పాలకవర్గాలు లేవు. వీటిలో జిల్లాలో నాలుగు పట్టణాలు ఉన్నాయి. కేంద్రం నుంచి ఆర్థిక సంఘం నిధులు మంజూరు కావాలంటే పాలకవర్గాలు ఉండాలి. ఇప్పటి వరకు నిధులు విడుదలవుతూ వచ్చాయి. ఇకపై నిధులు నిలిచి పోనున్నాయి. ఇదే విషయమై మున్సిపాలిటీలు ఆందోళన చెందుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులతోనే మున్సిపాలిటీలు అభివృద్ధి పనులు చేస్తుంటాయి. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి అవసరాల కోసం నిధులు వెచ్చిస్తాయి. రహదారులను నిర్మిస్తాయి. ప్రతి మున్సిపాలిటీకి రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు నిధులు కేటాయిస్తారు. దీంతో మున్సిపాలిటీ ఎన్నికలపై ప్రభుత్వస్థాయిలో తర్జనభర్జన పడుతున్నారు. పాలకవర్గాలు లేకపోవడంతో అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతోంది. వైసీపీ హయాంలో నిధులు దుర్వినియోగమయ్యాయి. ప్రాధాన్యతలను విస్మరించి కంకర రహదారులు వేశారు. తాడేపల్లిగూడెంలో ఇటువంటి పనులు నిర్వహిస్తే.. ఇతర పురపాలక సంఘాల్లో తమకు నచ్చిన రీతిలో పనులు చేపట్టారు. మొత్తంపైన పాలక వర్గాలు లేనిలోటు స్పష్టంగా కనిపించింది.

ప్రయత్నాలు వృథా...

విలీన గ్రామాల రికార్డులను స్వాధీనం చేసుకోవాలని గతంలో జిల్లా కలెక్టర్ నుంచి ఆదేశాలు వెళ్లాయి. రికార్డులు స్వాధీనానికి మున్సిపల్ అధికారులు నోటీసులు జారీచేశారు. వీటి ఆధారంగా గ్రామస్తులు మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. రికార్డుల స్వాధీనాన్ని హైకోర్టు నిలుపుదల చేయడంతో గ్రామాల విలీనానికి బ్రేక్ పడింది.

మెప్మా పరిధిలో మహిళా సంఘాలు

గ్రామాలు విలీనం నిలిచిపోయినా జిల్లాలో మున్సిపాలిటీలకు ఆనుకుని 17 పంచాయతీల్లోని మహిళా సంఘాలను మెప్మాలో కలిపేశారు. వాస్తవానికి గ్రామాల్లోని మహిళా సంఘాలు డీఆర్‌డీఏ పరిధిలో ఉంటాయి. పట్టణాల్లోని సంఘాలు మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తుంటారు. విలీన గ్రామాల్లోని సంఘాలను మెప్మా పరిధిలోకి తెచ్చారు. పన్నుల వసూళ్లు, కార్యదర్శులు, సిబ్బంది అంతా పంచాయతీలే నిర్వహిస్తూ వస్తున్నాయి. పంచాయతీలుగానే అన్ని కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఒక్క మహిళా సంఘాలను మాత్రమే పట్టణాల పరిధిలోకి తెచ్చారు. దీనివల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. ఇలా విలీనం నిలిచిపోవడంతో ఆర్థిక సంఘం నిధులతోపాటు, పాలనాపరమైన సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయి. గ్రామాల ప్రజలు విలీనానికి అంగీకరించడం లేదు. భీమవరం పట్టణాన్ని కార్పొరేషన్ చేసేందుకు అనుమతి ఇస్తే వీలీనం చేస్తామంటూ రాయలం, చిన అమిరం, అనాకోడేరు, తాడేరు తదితర గ్రామాల నేతలు స్పష్టం చేశారు.

ఎన్నికలకు వెళుతుందా ?

నిధులు నిలిచిపోనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఎన్నికలకు ఆలోచన చేస్తోంది. అదే జరిగితే పాత వార్డుల ప్రకారమే నిర్వహించాలి. ఆ మేరకు మున్సిపాలిటీలను మళ్లీ కుదించనున్నారు. అప్పుడే ఎన్నికలకు మార్గం సుగమం అవుతుంది. ప్రభుత్వస్థాయిలో నిర్ణయం తీసుకోవాలి. ప్రస్తుతం ఒక్క నర్సాపురంలోనే కౌన్సిల్ ఉంది. భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు మున్సిపాలిటీల్లో ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలోనే పాలన సాగుతోంది. ప్రభుత్వ నిర్ణయం కోసమే ఎదురు చూస్తున్నారు.

మున్సిపాలిటీ.. విలీన గ్రామాలు

- భీమవరం : రాయలం, నరసింహపురం, కొవ్వాడ అన్నవరం, తాడేరు, చిన అమిరం,
- తాడేపల్లిగూడెం : కొండ్రుప్రోలు, పడాల, ఎల్.అగ్రహారం, కుంచనపల్లి, ప్రత్తిపాడు,
- తణుకు : వైడిపర్రు, వెంకట్రాయపురం, వీరభద్రపురం.
- పాలకొల్లు : అడవిపాలెం, ఉలంపర్రు, కొంతేరు, పెంకుళ్లపాడు, పూలపల్లి, భగ్గేశ్వరం, పాలకొల్లు రూరల్ పంచాయతీ.

వండకుండానే బొక్కేస్తున్నారు..!


తాడేపల్లిగూడెం మండలంలో మోటారు సైకిల్‌పై తరలిస్తున్న రేషన్ బియ్యం

- **రేషన్ బియ్యం అమ్మినా.. కొన్నా నేరమే.. మోటారు సైకిళ్లపై ఇంటింటా సేకరణ**
- **కిలో రూ.15 కొనుగోలు.. గోదాముల్లో నిల్వలు.. అరకొర దాడులు**

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):'ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించే బియ్యం తినడానికి వీలుగా ఉంటే బాగుంటుంది. దీనివల్ల ఈ పీడీఎస్ వ్యాపారం తగ్గించవచ్చ'ని తాడేపల్లిగూడెంకు చెందిన విజయ్ చెబుతున్నారు. ప్రస్తుతం తెల్ల రేషన్ కార్డుదారులకు సంపత్ స్వర్ణ రకం బియ్యాన్ని అందిస్తున్నారు. అయితే ఆ రకం ఇష్టపడి తినేవారు తక్కువ. తప్పక తినేవారు మాత్రమే తింటారు. ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన ధాన్యంలో కొంత మేర మిల్లింగ్ చేసి ప్రజలకందించే ఏర్పాటు చేస్తోంది. గత వైసీపీ సర్కార్ పేదలకందించేందుకు సన్న రకం బియ్యం అందిస్తామని చెప్పి.. తర్వాత 'సన్న రకం కాదు.. నాణ్యమైన రకం ఇస్తామని చెప్పామని' మాట తప్పింది. ఏది ఏమైనా ప్రజలకు ఉపయోగపడే బియ్యం అందిస్తే బాగుంటుందనేది అందరి అభిప్రాయం.

పట్టపగలే తరలింపు.. అరకొర దాడులు

పేదలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న బియ్యమే లక్ష్యంగా కొన్నేళ్లగా మాఫియా చెలరేగిపోతోంది. రేషన్ బియ్యం కొనేందుకు గ్రామాలు, పట్టణాల్లో మోటారు సైకిళ్లపై ఇంటింటికి వస్తున్నారు. రోజూ టన్నుల కొద్దీ తరలిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు చేపడుతున్నా మాఫియా లెక్క చేయడం లేదు. విజిలెన్స్ అధికారులు అరకొర దాడులు నిర్వహిస్తున్నా ఈ మాఫియా ఆగడాలు ఆగడం లేదు. ఇంటింటి నుంచి సేకరించిన బియ్యాన్ని వ్యాపారులు రీ సైకిల్ చేసేందుకు ఉమ్మడి తూర్పుగోదావరిలోని రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. మరికొందరు బియ్యాన్ని నూకలు గా మార్చి కోళ్ల ఫారాలు, చెరువులకు పంపిస్తున్నారు. ఇటీవల ఓ ముఠా తాడేపల్లిగూడెం ప్రాంతంలోని ఓ గోదాములో పీడీఎస్ బియ్యాన్ని భారీ స్థాయిలో నిల్వ చేసింది. దీనిపై విజిలెన్స్ అధికారులు దాడులు చేసి బియ్యాన్ని సీజ్ చేశారు. కృష్ణాయపాలెంలో ఓ వ్యాపారి తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకుని వ్యాన్‌తోపాటు స్వాధీనం చేసుకున్నారు. అరకొరగా దాడులు చేస్తుండడంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. బియ్యం కొనుగోలుకు వ్యాపారులు ప్రతీ నెలా ఒకటి నుంచి 15వ తేదీ మధ్య వందల సంఖ్యలో మోటారు సైకిళ్లపై ఇళ్లకు **(మిగతా 8లో)**

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని ఓ గ్రామంలో 850 బియ్యం కార్డులు ఉన్నాయి. ప్రతీ నెలా 830 మంది కార్డుదారులు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించే బియ్యం తీసుకుంటారు. వీరిలో పాతిక శాతం మంది వరకు ఈ బియ్యాన్ని వండుకుని తింటారు. మరికొందరు మరపట్టించి పిండి వంటలు, జావ తదితర వాటికి వినియోగిస్తారు. అధిక శాతం మంది ఆ బియ్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు కిలో రూ.15 నుంచి 18కి విక్రయిస్తున్నారు. ఆపై నాణ్యమైన బియ్యాన్ని కొనుగోలు చేసి తింటారు. ప్రభుత్వమే పేదలు తినేందుకు వీలుండే బియ్యం అందిస్తే ఈ బియ్యం పక్కదారి పట్టే పరిస్థితి తగ్గుతుంది.

• చట్టం ఏం చెబుతుంది ?

ప్రజా పంపిణీ వ్యవస్థలో పేదలకందించే బియ్యం అమ్మినా, కొనుగోలు చేసినా చట్ట ప్రకారం నేరం. ప్రభుత్వాన్ని మోసం చేయడంతోపాటు ప్రజలను మభ్యపెట్టినందుకు 420 కేసుతోపాటు, ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రత్యేకమైన నేరం కింద 7 క్లాజ్ 1లో కేసు నమోదు చేస్తారు. స్వాధీనం చేసుకున్న బియ్యం, రవాణా చేస్తున్న వాహనాన్ని సీజ్ చేస్తారు. నేరం రుజువైతే జరిమానా విధిస్తారు. ఈ కేసుల్లో జైలు తక్కువగా పడుతుండడంతో ఈ దందా చేసే వారు చట్టాన్ని లెక్కచేయడం లేదు.


ప్రజల సమస్యలను వింటున్న కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్‌కుమార్

ఫిర్యాదు మళ్లీ రాకూడదు

- **పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్ నాగరాణి**

భీమవరం టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదులు మళ్లీ మళ్లీ రాకుండా ప్రజలందించే వినతులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో ప్రజల నుంచి 174 ఫిర్యాదులను స్వీకరించారు. ముందుగా గత వారం వచ్చిన ఫిర్యాదులపై అధికారులు తీసుకున్న చర్యలను సమీక్షించారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- 'నాకు ఐదు సెంట్ల భూమి వుంది. సరిహద్దు రైతులతో తరచూ వివాదం జరుగుతోంది. సర్వే చేసి సరిహద్దులు నిర్ణయించాలి' అని మొగల్తూరు మండలం పేరుపాలెంకు చెందిన అండ్రాజు లక్ష్మణస్వామి కోరారు.
- 'కౌలుకు భూమి తీసుకుని సాగు చేస్తున్నా. సమీపంలోని కొందరు వనామి చెరువులను సాగు చేసి ఆ నీటిని పంట బోదెలో వదిలేస్తుండడంతో పంట నాశనం అవుతోంది. చర్యలు తీసుకుని నా పంటను కాపాడండి' అని పెనుమంట్ర మండలం నెలమూరుకు చెందిన శివకుమార్ కోరారు.
- తుఫాను కారణంగా నత్తలోవ మురుగు కాల్వలో పడిపోయిన చెట్లను తొలగించాలని నరసాపురం మండలం సరిపల్లికి చెందిన ఎం రత్నరాజు, టిడ్కో ఇల్లు ఇప్పించాలని భీమవరానికి చెందిన నాగరాజ వెంకట వరలక్ష్మి కోరారు.

జిల్లాలో ఇసుక నిల్వలకు స్టాక్ పాయింట్లు : కలెక్టర్

భీమవరం టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):'జిల్లాలో ఇసుక అందుబాటులో లేదు. కావున పొరుగు జిల్లాల నుంచి తీసుకువచ్చి స్టాక్ పెట్టాలి. ఇందుకు అనువైన పాయింట్లను, ఏజెన్సీలను గుర్తించాలి' అని జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎస్పీ అద్నాన్ నయీం అస్మీతో కలిసి ఇసుకపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ట్రాక్టర్స్ ఎడ్లబండ్ల ద్వారా గృహ అవసరాలకు ఇసుకను తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అనుమతులను జారీ చేసిందని, కావున సచివాలయంలో ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు ఒకటి, రెండు రోజుల్లో ఒక యాప్ అందుబాటులోకి తీసుకురానున్నదని తెలిపారు. లోడింగ్, అన్ లోడింగ్‌లకు మిషనరీ ఉపయోగించకూడదన్నారు.

నైపుణ్య గణన సర్వే

నవంబర్ మొదటి వారంలో నైపుణ్య గణన(స్కిల్ సెన్సెస్)కు సర్వే చేప డుతున్నట్లు కలెక్టర్ నాగరాణి తెలిపారు. 29న కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి శిక్షణా కార్యక్ర మం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలోని 15 నుంచి 59 ఏళ్ల వయసున్న నైపుణ్యం గల వ్యక్తుల వివరాలు సేకరించి, నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకమాన్, జిల్లా ఉపాధి అధికారి వరలక్ష్మిలను నియమించామన్నారు.



మహిళా సమస్యలపై వేగంగా స్పందించాలి : ఎస్పీ నయీం

భీమవరం క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహిళా సమస్యలపై పోలీసు అధికారులు వేగంగా స్పందించాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. ప్రజల సమస్యలను స్వయంగా విని, వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. భూవివాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీల్లో మోసాలపై 14 మంది ఫిర్యాదులు చేశారు. జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డీఆర్వోగా వెంకటేశ్వరరావు



భీమవరం టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారిగా మొగిలి వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి, జేసీ టి.రాహుల్‌కుమార్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ల ఆందోళన

పాలకొల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):ఎల్ఐసీ ఏజెంట్లు ఆందోళనబాట పట్టారు. ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐఆర్‌డీఏఐ) తీసుకువచ్చిన మార్పుల కారణంగా ఏజెంట్ల హక్కులకు భంగం కలుగుతుందని నిరసించారు. ఐఆర్‌డీఏఐ చేసిన మార్పులను నిరసిస్తూ దేశవ్యాప్త ఆందోళనలో భాంగా ఉమ్మడి పశ్చిమ గోదావరిలోని అన్ని ఎల్ఐసీ కార్యాలయాల వద్ద బీమా ఏజెంట్లు ధర్నాలు చేశారు. పాలసీదారులకు కలుగుతున్న నష్టాలను, భవిష్యత్తులో బీమా ఏజెంట్లకు ఎదురయ్యే ఇబ్బందులను సంఘ నాయకులు తెలిపారు. భారతీయ జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ) యాజమా న్యం తీసుకొచ్చిన మార్పులతో దేశవ్యాప్తంగా వున్న 14 లక్షల మంది ఎల్ఐసీ ఏజెంట్ల హక్కులకు భంగం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఎల్ఐసీ పాత ప్లాన్‌లను రద్దు చేసి నూతన పాలసీలు ప్రవేశపెట్టింది. ఇందులో ప్రీమియం పెంచి, ఏజెంట్లకు కమీషన్ తగ్గించారు. దీనిపై ఏజెంట్లు ఆందోళన చేపట్టారు. ఏజెంట్ల మనుగడకు విఘాతం కల్గించే క్లా బ్యాక్ కమీషన్‌ను నిబంధన, జీఎస్‌టీని తొలగించాలని డిమాండ్ చేశారు.


పాలకొల్లులో ఏజెంట్ల ఆందోళన

సంస్థ ధోరణి మార్చుకోవాలి



ఎల్ఐసీ ఏజెంట్లు జీతభత్యాలు లేకుండా కేవలం తమకు వచ్చే కమీషన్ మీదే జీవనం సాగిస్తున్నారు. అధిక సంఖ్యలో చిన్నతరహా ఏజెంట్లే ఉన్నారు. ఐఆర్‌డీఏఐ నిబంధనలంటూ ఏజెంట్లకు ఇచ్చే కమీషన్ తగ్గించడం క్లా బ్యాక్ నిబంధనలు విధించడం దారుణం. సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా లక్ష రూపాయలు బీమా మెత్తాన్ని రూ.2 లక్షలకు పెంచడం అన్యాయం. ఎల్ఐసీ తీసుకున్న నిర్ణయాలను పునపరిశీలించాలి.

శలా రామలింగేశ్వరరావు, ఎల్ఐసీ ఏజెంట్ల అసోసియేషన్ రాజమండ్రి డివిజన్ ఉపాధ్యక్షులు

జిల్లావ్యాప్తంగా నిరసనలు

భీమవరం టౌన్/తాడేపల్లిగూడెం రూరల్/పాలకొల్లు/తణుకు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఏజెంట్ల కమిషన్ తగ్గింపు నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలి. కొత్తపాలసీలపై ప్రీమియం తగ్గించాలి. బోనస్‌లు పెంచాలి. జీఎస్టీ తొలగించాలి' అని అంశాలపై డిమాండ్ చేస్తూ జిల్లావ్యాప్తంగా ఎల్ఐసీ ఏజెంట్లు ఆందోళన బాట పట్టారు. భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం ఎల్ఐసీ బ్రాంచిల వద్ద సోమవారం ధర్నాలు చేశారు. సంఘం నాయకులు జీవీ భాస్కరరావు పి.సర్వేశ్వరరావు, కె.మనోహర్, న్యూటన్, బి.మాణిక్యాలరావు, ఆర్.శ్రీనివాసరావు, ఆర్.విశ్వనాథశాస్త్రి, ఎన్. బాపిరాజు, జీవీ.సత్యనారాయణ, నాగబాబు, శ్రీనివాసు,ఉదయ భాస్కర రావు, పాండు రంగారెడ్డి, ఎ.సత్యనారాయణ, పీవీ శ్రీనివాసరావు, పొత్తూరి సత్యనారాయణ, నాగబాబు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో ఎల్ఐసీ ఏజెంట్ల ధర్నా

హోమాల పేరిట 54 రోజుల నిర్బంధం
- రూ.37.50 లక్షల వసూలు
- సిద్ధాంతిపై కేసు నమోదు

రెండేళ్లుగా చోరీలు
- ఎట్టకేలకు దొరికిన ఇద్దరు దొంగలు.. బంగారం స్వాధీనం

మునిసిపల్ టీచర్లకు పదోన్నతులు
- ఏళ్ల తరబడి... ఎదురుచూపు
- కూటమి ప్రభుత్వం రాకతో తీరనున్న ఆకాంక్ష.. 7

స్విమ్మింగ్ పోటీల్లో పశ్చిమ పోలీసులకు పతకాలు 6
- అభినందించిన ఎస్పీ నయీం

అవీ..ఇవీ

అయ్యప్ప భక్తుల అవస్థలు



ఇసుక తిన్నెల్లో కాలికి సిమెంటు సంచులతో అయ్యప్ప భక్తులు

సిత్రాలు సూడరో శివుడో శివుడా.. శివమెత్తి ఆడరో శివుడో శివుడా...? ఇసుక తిన్నెల్లో అయ్యప్ప స్వాములు ఏంటి.. కాళ్లకు సిమెంటు సంచులేంటి ? అనుకుంటున్నారా.. సోమవారం పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయానికి తూర్పుగోదావరి జిల్లా దుళ్ళ గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తులు యాభై మందివచ్చారు. ఆలయంలో అర్చనలు అభిషేకాలు పూర్తయ్యేసరికి మధ్యాహ్నం ఒంటి గంటయ్యింది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. మధ్యాహ్నం వడి కార్యక్రమాలకు ముందు స్నానాలాచరిం చేందుకు గోదావరి నదికి వచ్చి స్నానాలు చేశారు. ఇసుకతిన్నెల్లో నడక సాగిస్తున్న తరుణంలో ఎండతీవ్రతకు అరికాళ్లు మంటలెక్కాయి. ఆ ఇసుక తిన్నెల్లో వేడికి తాళలేక శివతాండవం చేశారు. ఇక చేసేదేం లేక నది తీరం ఒడ్డున ఇసుక బస్తాల సంచులు కాలికి తగిలించుకుని ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు.

- పోలవరం

పాలకోడేరులో అమెరికా పావురాలు..



ఇటీవల ప్రతీ ఒక్కరికి జంతువుల ప్రేమ పెరిగింది. కుక్కలు, పిల్లులు, కుందేళ్లను పెంచుకుంటున్నారు. అదేవిధంగా పక్షులను పెంచుకునేందుకు ఇష్టపడుతున్నారు. కుటుంబ సభ్యులతో సమానంగా వాటిపై కూడా ప్రేమ, ఆప్యాయతలను కనబరుస్తు న్నారు. పాలకోడేరు మండలం మోగల్లు గ్రామంలోని కంకిపాటి జోసఫ్‌రాజు ఇంట్లో పావురాలను పెంచుకుంటున్నారు. సుమారు నాలుగు నెలల క్రితం తణుకులో రెండు పావురాలను రూ.3 వేలకు కొన్నారు. ఈ పావురాలు కూడా ఎక్కడికి వెళ్ళకుండా కుటుంబ సభ్యులతోనే ఉంటున్నాయి. వీటిని అమెరికా పావురాలు అంటారని ఇవి అందరితో కలిసిపోతాయని ఎవరు దగ్గరకు తీసుకున్నా వస్తాయని ఆయన చెప్పారు. వీటికి ఆహారంగా పెసలు, కొర్రలు, సామలు, వంటివి పెడుతున్నారు. పావురాలు అంటే ఎంతో ఇష్టమని అందుకే పెంచు కుంటున్నామని తెలిపారు.

-పాలకోడేరు

ఆ కుటుంబంలో అంతా ప్రజా ప్రతినిధులే..



సర్పంచ్‌గా చేసిన పసుమర్తి ప్రభాకరరావు, ఆయన భార్య ప్రస్తుత సర్పంచ్ రాజేశ్వరి, కుమారుడు మధుబాబు

అవకాశవాద రాజకీయాలు రాజ్యమేలు తున్న నేటి రోజుల్లో ప్రజలకు మంచి చేస్తే ఎప్పటికి మరచిపోకుండా నెత్తిన పెట్టు కుంటారని చెప్పేందుకు ఆ కుటుంబమే నిదర్శనంగా నిలుస్తుంది. దెందులూరు మండలం జోగన్నపాలెం పసు మర్తి కుటుంబంలో తాత, కొడుకు, కోడలు, మనవడు ఇలా వరుసగా ప్రజా ప్రతి నిధులుగా సేవ చేస్తూ ఇప్పటితరం రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రస్తుతం సర్పంచ్ పసుమర్తి రాజేశ్వరి మామగారు దివంగత పసుమర్తి నాగభూషణం జోగన్నపాలెం సర్పంచ్‌గా మూడు పర్యాయాలు అంటే 15 సంవత్సరాలు పాటు ఏకగ్రీవ సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన భీమడోలు సమితి వైస్‌చైర్మన్‌గా పని చేశారు. ఆయన అనంతరం వారి కుమారుడు పసుమర్తి ప్రభాకర్‌రావు 1988 సంవత్సరం నుంచి 5 సంవత్సరాలు సర్పంచ్‌గా పనిచేశారు. రెండు సంవత్సరాల పాటు ఎన్నికలు నిర్వహించక పోవడంతో 1995 వరకూ ఆయనే సర్పంచ్‌గా ఉన్నారు. ప్రభాకర్ భార్య పసుమర్తి రాజేశ్వరి 2006 సంవత్సరం నుంచి 2011 వరకూ సర్పంచ్‌గా పనిచేశారు. ప్రస్తుతం కూడా ఆమే సర్పంచ్‌గా ఉన్నారు. వీరి కుమారుడు మధుబాబు ప్రస్తుతం టీడీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడిగా జోగన్నపాలెం సహకార సంఘం బ్యాంకు అధ్యక్షుడుగా పనిచేశారు. వీరి మావయ్య సీతంపేట సహకార బ్యాంకు అధ్యక్షుడిగా సుంకర రామచంద్రావు రెండు సార్లు బ్యాంకు అధ్యక్షుడిగా పని చేశారు. మాట ఇస్తే ఎంత కష్టమైనా, నష్టమైనా పని చేస్తారని ప్రజల్లో ఉన్న నమ్మకమే వారిని ప్రజా జీవితంలో ఉండేలా చేస్తోంది.

-దెందులూరు



కొడమంచిలి మేడకు వందేళ్ల పండుగ

ఆచంట మండలం కొడమంచిలిలో వందేళ్లు దాటినా చెక్కు చెదరకుండా అందరినీ ఆకర్షి స్తోంది. రెండు అంతస్తులు క లిగిన అందమైన ఈ భవనాన్ని అప్పట్లో గ్రామంలో అంతా చార్మినార్ అని పిలిచేవారు.. గ్రామానికి చెందిన జమీందా ర్‌గా పిలవబడే మన్నె సత్యనారాయణ మూర్తి 1923లో వివిధ ప్రాంతాల నుంచి తె చ్చిన మెటీరియల్ , బర్మా నుంచి తెచ్చిన టేకుతో ఇంటిని నిర్మించారు. ఇప్పటి వరకు నాలుగు తరాలు వారు ఇందులో నివాసం ఉండగా నేటికీ భవనం చెక్కు చెదరలేదు. ఇటీవలే వందేళ్ళు పూర్తి చేసుకున్న సంద ర్భంగా ఈ భవనానికి రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. ఈ భవనంలో మొత్తం రెండు అంతస్తులు కలిపి పది గదులు, మూడు హాల్లు ఉన్నాయి. వేసవి కాలంలో ఈ ఇంట్లో చల్లగానే ఉండటం విశేషం. మొదటితరం జమీందార్‌గా పిలువ బడే మన్నె సత్యనారాయణ మూర్తి కొడమం చిలితో పాటు వివిధ ప్రాంతాలను కూడా పరిపాలించేవారని చెబుతుంటారు. వీరి కుటుంబ సభ్యుల్లో అనేక మంది గ్రామానికి కొన్నేళ్లపాటు సర్పంచ్‌లుగా, సొసైటీల అధ్యక్షులుగా పనిచేశారు. ఈ కుటుంబానికి చెందిన వారే నరసాపురంలో ఒక సత్రం కూ డా ఏర్పాటు చేశారు. ఇప్పటికి నరసా పురంలో ఉంది. ఈ కుటుంబ సభ్యులు ఎక్కువగా రాజమండ్రి, కాకినాడ, విశాఖప ట్టణం వంటి నగరాల్లో వ్యాపారం నిమిత్తం స్థిరపడ్డారు. ఇప్పటికే ఆచంటలో వందేళ్ళు క లిగిన అందమైన గంధర్వ మహల్ ఉంది. ఇటీవలే ఈ భవనాకి కూడా వందేళ్ల పండుగ చేశారు.



-ఆచంట

గేట్ పరీక్షలపై అవగాహన

నూజివీడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీలో హయ్యర్ ఎడ్యుకేషనల్ సెల్ ఆధ్వర్యంలో గేట్, ఐఈఎస్ పరీక్షల నిర్వహణపై మేడ్ ఈజీ సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. సంస్థ సీనియర్ ఫ్యాకల్టీ జితేంద్ర తివారీ, ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లలో తరగతుల నిర్వహణపై వివరించారు. హయ్యర్‌ఎడ్యుకేషనల్ సెల్ ఇన్‌చార్జ్ ఎం.రామకృష్ణ, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్, ఏవో బి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పంచారామాలకు బస్సులు

నూజివీడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో పంచారామాల దర్శనానికి నూజివీడు ఆర్టీసీ బస్ డిపో నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు డీఎం సూర్య పవన్‌కుమార్ తెలిపారు. నవంబరు 3వ తేదీ రాత్రి 9 గంటలకు బయలుదేరే సూపర్ లగ్జరీ బస్సు మరునాడు రాత్రి 10 గం టలకు నూజివీడు చేరుతుందన్నారు.బస్సు నవంబరు 10, 17, 24 తేదీల్లో కూడా అందు బాటులో ఉంటుం దని, 20 మందికి మించి ప్రయా ణికులు ఒకేచోట టిక్కెట్ బుక్ చేసుకుంటే బస్సు వారి వద్దకే వస్తుందన్నారు



టుడే ఈవెంట్

తలరాతను మారుద్దాం

నేడు ప్రపంచ బ్రెయిన్ స్ట్రోక్ డే

ప్రస్తుతం మనం ఉంటున్న నేల.. పీలుస్తున్న గాలి.. తింటున్న ఆహారం అన్నీ కలుషితమవుతున్నాయి. మారిన కాలంతో పాటు ఆహార అలవాట్లు మారాయి. రసాయన మిళిత ఆహారాలు మన సహజ ఆరోగ్యాన్ని దెబ్బతీసి వయసుతో సంబంధం లేకుండా కుంగదీస్తున్నాయి. వీటితో పాటు మానసిక ఒత్తిడి, రుగ్మతలు బ్రెయిన్ స్ట్రోక్‌కి కారణమవుతున్నాయి. అక్టోబరు 29 వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే సందర్భంగా బ్రెయిన్ స్ట్రోక్ గురించి కొన్ని విషయాలు తెలుసుకుందాం.. బ్రెయిన్ స్ట్రోక్ బారిన ఎవరూ పడకుండా జాగ్రత్త పడదాం. - పోలవరం

మారిన ఆహార అలవాట్లతో రోగాలు

మెదడు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

సుగర్, బీపీ అదుపులో ఉంచుకోవాలి

ఈ ఏడాది ఇప్పటివరకు 1300 పైగా బ్రెయిన్ స్ట్రోక్ కేసులు నమోదు

మెదడుకి రక్తాన్ని సరఫరా చేసే మెదడు రక్తనాళాలపై ప్రభావం చూపే బ్రెయిన్ స్ట్రోక్‌ని వైద్య పరిభాషలో సెరెబ్రో వాస్కులర్ డిజార్డర్ అంటారు..దానినే మనం పక్షవాతం అని పిలుస్తాం. బ్రెయిన్ స్ట్రోక్‌లలో కూడా రెండు రకాలు ఉన్నాయి. నలుగురిలో ఒకరికి వారి జీవిత కాలంలో స్ట్రోక్ వచ్చే అవకాశాలున్నాయి. మెదడుకి రక్త సరఫరా తగ్గడం ప్రధానంగా రెండు కారణాల వల్ల జరుగుతుంది ఒకటి రక్తం గడ్డకట్టడం దీనిని వైద్య పరిభాషలో ఇస్కీమిక్ స్ట్రోక్ అంటారు. మరొకటి మెదడులో రక్తస్రావం..దీనిని వైద్య పరిభాషలో హెమరేజిక్ స్ట్రోక్ అని అంటారు. మెదడు సరిగా పనిచేయడానికి అవసరమయ్యే ఆక్సిజన్ పోషకాల సరఫరాకు అంతరాయం కలగడం వల్ల శరీరంలో వచ్చే మేజర్ ఆరోగ్య మార్పులే పక్షవాతం. ఆక్సిజన్ లేదా రక్తం సరఫరా లేకపోవడం వలన కేవలం కొన్ని నిమిషాలు మెదడు కణాలు పనిచేయకపోవడం, క్షీణించడం వల్ల మెదడు ప్రభావితమై శరీర భాగాలకు రక్త సరఫరా నిలిచి పోవడం తద్వారా శరీర భాగాలు చచ్చుబడడం జరుగుతుంది. మెదడులో రక్త నాళం పగిలినప్పుడు సంభవించే అత్యవసర పరిస్థితి స్ట్రోక్ అని చెప్పవచ్చు. ఈ స్ట్రోక్ మెదడుకి శాశ్వత నష్టం లేదా దీర్ఘకాలిక వైకల్యం లేదా కొన్ని సందర్భాలలో మరణం కూడా సంభవించవచ్చు.

లక్షణాలు ఇవీ..



- ముఖం చేయి లేదా కాలు ముఖ్యంగా శరీరంలో ఒకవైపున ఆకస్మిక తిమ్మిరి లేదా బలహీనత
- ఆకస్మిక ఆందోళన, మాట్లాడంలో ఇబ్బంది నాలుక మడతపడడం
- మాటలు వినిపించు కోవడం, అర్థం చేసుకోవడంలో ఇబ్బంది.. ఒకటి లేదా రెండు కళ్ళతో చూడడంలో ఇబ్బందులు
- తల తిరగడం , నడకలో మార్పు, సమతుల్యత కోల్పోవడం, సూచనలకు స్పందించలేకపోవడం
- వాంతులు లేదా అపస్మారక స్థితికి చేరుకోవడం.. ఆకస్మాత్తుగా తీవ్రమైన తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ఎవరికి వస్తుంది

హైపర్ టెన్షన్ అని పిలవబడే అధిక రక్తపోటుని బీపీ అంటారు. బీపీ మెదడుకి రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాలు దెబ్బతినడానికి కారణమవుతాయి. అదుపు తప్పిన బీపీ కూడా స్ట్రోక్‌కి కారణమ వుతుంది. షుగర్ రోగుల్లో కూడా రక్త నాళాల్లో సంభవించే మార్పుల వల్ల స్ట్రోక్ వస్తుంది. ధూమపానం చేయని వ్యక్తులతో పోల్చినప్పుడు ధూమపానం చేసేవారిలో ఇస్కీమిక్ స్ట్రోక్ సంభవించే ప్రమాదం రెట్టింపు ఉంటుంది. హైపర్ బ్లడ్ కొలెస్ట్రాల్ వల్ల రక్త నాళాలను కుంచించుకుపోయి మెదడు రక్త సరఫరాని తగ్గించడం వల్ల కూడా స్ట్రోక్ వస్తుంది. మరికొన్ని సందర్భాలలో లైంగిక సామర్థ్యాన్ని పెంచుందుకు వాడే నిషేధిత మందుల వాడకం వల్ల కూడా స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతాయి. బ్రెయిన్ స్ట్రోక్ సమస్యలలో ఒకటి సెరిబ్రల్ ఎడెమా అనబడే మెదడు వాపు..ఈ సమస్యలో మూర్ఛ వచ్చి అపస్మారక స్థితి కలుగుతుంది.

ప్రపంచ వ్యాప్తంగా ఏటా 1.5 కోట్ల మంది స్ట్రోక్‌తో బాధపడు తున్నారు. వారిలో 50 లక్షల మంది మృత్యువాత పడుతు న్నారు. మరో 50 లక్షల మంది శాశ్వత వికలాంగులుగా మిగిలిపోతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మరణాలకు రెండవ కారణంగా బ్రెయిన్ స్ట్రోక్ నిలుస్తుంది. 65 సంవత్సరాల కంటే వయసు పైబడిన వారికే ఎక్కువగా స్ట్రోక్ వస్తుంది. పురుషులతో పోలిస్తే 60 శాతం స్త్రీలు స్ట్రోక్‌కి గురవుతున్నారు. వారిలోనే అధిక శాతం మరణాలు సంభవిస్తున్నాయి. ఏలూరు జిల్లాలో ఈ ఏడాది 373 బ్రెయిన్ స్ట్రోక్ కేసులు నమోదు కాగా ప్రైవేటు ఆస్పత్రులలో సుమారు 900కి పైగా కేసులు నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి.

మెదడులో అసాధారణ విద్యుత్ చర్య వల్ల శరీరంపై నియంత్రణ కోల్పోతారు. మూత్ర విసర్జనపై నియంత్రణ లేకపోవడం వల్ల బ్యాగ్ అమర్చాల్సిన అవసరం వుంటుంది. న్యుమోనియా స్ట్రోక్‌తో బాధపడేవారిలో ఊపిరితిత్తుల్లోకి ఆహారం పీల్చబడి ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ వస్తుంది. శరీర భాగాలపై నిరంతర ఒత్తిడి కారణంగా చర్మంపై బెడ్‌సోర్స్ అనబడే పుండ్లు ఏర్పడవచ్చు. క్లినికల్ డిప్రెషన్, ఆస్పత్రి వాతావరణం, మందుల వాసన, నిరంతర విచారం, మానసిక ఒత్తిడి వంటి అనుభూతి కలుగుతుంటుంది.

వచ్చిన వెంటనే ఏం చెయ్యాలి

24 నుంచి 48 గంటల్లో మెదడు, నరాల స్పెషలిస్టు , న్యూరాల జిస్టుని సంప్రదించి వైద్య సేవలం దించడం వల్ల మెరుగైన ఫలితా లుంటాయి. స్ట్రోక్ చికిత్సలో మందులు లేదా ఆపరేషన్ ప్రక్రియలు ఉంటాయి. స్ట్రోక్ కేర్, న్యూరో ఎండో వాస్కులర్ విధానాలలో ప్రత్యేక శిక్షణ పొందిన న్యూరాలజిస్టులను వైద్య సేవల కోసం ఎంచుకోవడం మంచిది.

నివారణ చర్యలు

ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు, రెగ్యులర్ హెల్త్ చెకప్‌ల ద్వారా బ్రెయిన్ స్ట్రోక్‌ని నివారించవచ్చు. ఆరోగ్యకరమైన ఆహారం తీసు కోవాలి. అధిక కొవ్వులు కలిగిన ఆహారాలు మాని సాచురేటెడ్ ఫ్యాట్స్ కలిగిన, ఫైబర్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి. ఉప్పు,చక్కెర వాడకం తగ్గించాలి చురుకైన నడక లేదా రెండున్నర గంటల ఏరో బిక్ ఫిజికల్ యాక్టివిటీ ద్వారా శరీరంలో ఉన్న అదనపు కొవ్వులను కరిగించే వ్యాయామాలు కనీసం వారానికి ఒకసారన్నా చేయాలి. బీపీ, సుగర్‌లను అదుపులో ఉంచుకోవడం , రెగ్యులర్ చెకప్‌లు చేసుకోవడం ద్వారా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవకుండా చూసుకోవచ్చు.

అలంపురం ట్రస్టులో ఉచిత న్యూరో సేవలు

పెంటపాడు : పెంటపాడు మండలం అలంపురం శ్రీవెంకట రమణా సేవా చారిటబుల్ ట్రస్టు ఆసుపత్రికి ప్రతీ నెల మూడో ఆదివారం ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ తీగల రమేష్ విచ్చేస్తారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. దీనికి సంబంధించి రక్తపరీక్షలు, అవసరమైన ఇతర పరీక్షలు కూడా ఆసుపత్రిలోనే ఉచితంగా చేస్తారు.వచ్చేనెల 17న ట్రస్టుకు రమేష్ వస్తారని ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక

మార్టేరులో ముగిసిన అండర్-17 పోటీలు

పెనుమంట్ర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) :పెనుమంట్ర మండలం మార్టేరులో జరిగిన 69 స్కూల్ గేమ్స్ అండర్-17 బాల బాలికల బాస్కెట్ బాల్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. బాలికల విభాగంలో కృష్ణ, పశ్చిమ గోదావరి జట్ల మధ్య జరిగిన పోటీలో కృష్ణా జిల్లా గెలుపొందగా తూర్పుగోదావరి అనంతపురం జట్ల మధ్య జరి గిన మ్యాచ్లో తూర్పు గోదావరి విజయం సాధిం చింది. బాలుర విభాగంలో కృష్ణా నెల్లూరు జట్ల మధ్య జరిగిన పోటీలో కృష్ణాజిల్లా విజయం సాధించగా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జట్ల మధ్య సాగిన పోటీలో పశ్చిమ గోదావరి జిల్లా గెలుపొందింది. క్రీడా స్ఫూర్తి పెంపొందించే విధంగా క్రీడాకారులు రాణించాలని ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే పితాని సత్యనారా యణ అన్నారు. రాష్ట్ర జాతీయ అంత ర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు పతకాలు సాధిం చే దిశగా వ్యాయామ ఉపాధ్యాయులు తరఫున ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ తాను క్రీడాకారుడు నేనని మార్టేరులో ప్రతి ఇంట్లోనూ ఒక బాస్కెట్ బాల్ ప్లేయర్ ఉంటారని క్రీడా పోటీలకు వేదిక నిచ్చే మార్టేరు క్రీడాకారులను ప్రోత్సహి స్తుందని చెప్పారు. విజేతలకు ట్రోఫీలను అంద జేశారు. రాష్ట్రస్థాయి బాస్కెట్బాల్ బాల,బాలికల విభాగం జట్లను ఎంపిక చేశారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి టీఎస్ఎన్ మల్లేశ్వరరావు, బాస్కెట్‌బాల్ పరి శీలకుడు శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి జి.చక్రవర్తి, పీవీఆర్ ట్రస్టు చైర్మన్ సూర్యనారాయణ, జాన్సన్, పీడీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతగా నిలిచిన కృష్ణా జిల్లా బాలుర జట్టు



రన్నర్‌గా నిలిచిన పశ్చిమ గోదావరి జిల్లా బాలుర జట్టు



బాలికల్లో రన్నర్‌గా నిలిచిన తూర్పుగోదావరి జట్టు

స్విమ్మింగ్ పోటీల్లో పశ్చిమ పోలీసులకు మెడల్స్

భీమవరం క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గుంటూరులో ఈనెల 27వ తేదీ ఆదివారం జరి గిన 5వ మాస్టర్స్ ఇంటర్ డిస్ట్రిక్ ఆక్వా టిక్ ఛాంపియన్‌షిప్ 2024 స్విమ్మింగ్ పోటీలలో పశ్చిమ గోదావరి జిల్లా పోలీస్‌శాఖ తరుపున హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్ళకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించినట్లు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. డీసీఆర్‌బీ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ 400 మీటర్ల ఫ్రీస్టైల్‌లో గోల్డ్ మెడల్, 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో గోల్డ్‌మెడల్ సాధించారు. తాడేపల్లిగూడెం టౌన్ కానిస్టేబుల్ అనిల్‌కుమార్ 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో గోల్డ్ మెడల్ అలాగే 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో సిల్వర్ మెడల్ సాధించారు. తాడే పల్లిగూడెం డీఎస్పీ కార్యాలయంలో పనిచేస్తున్న యస్ శ్రవణ్‌కుమార్ 100 మీటర్ల బటర్‌ఫ్లై ఈవెంట్లో సిల్వర్ మెడల్ సాధించారు. వీరిని ఎస్పీ నయీం అస్మి, అదనపు ఎస్పీ భీమారావు అభినందించారు. ప్రతిభ కనబరిచిన ముగ్గురికి మంచి భవిష్యత్ ఉందని ముందు ముందు ఇంకా గొప్ప విజయాలు సాధించి పోలీస్‌శాఖకు పేరు తేవాలని ఎస్పీ ఆకాంక్షించారు.



గోల్డ్ మెడల్స్ సాధించిన పోలీసులను అభినందిస్తున్న జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

స్పోర్ట్స్ కాలమ్



యువజనోత్సవాలకు ఎంపికైన విద్యార్థినులు

రాష్ట్రస్థాయి యువజనోత్సవాలకు ఎస్‌కేఎస్‌డీ విద్యార్థినులు

తణుకు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థినులు పలువురు వివిధ విభాగాల్లో రాష్ట్రస్థాయి యువజనోత్సవాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీ సుందరీబాయ్ తెలిపారు. జానపద గీతం గ్రూపులో బి.షణ్ముఖేశ్వరి ప్రథమ, సోలో ఎ.ఝాన్సీ ప్రథమ, జానపద నృత్యం సోలో కె.ఖ్యాతేశ్వరి ప్రథమ, కవిత్వంలో కె.వెంకట రమ్య ప్రథమ, ఉపన్యాసంలో కె.వెంకటరమ్య ప్రథమ, స్టోరీ రైటింగ్‌లో ఎ.రాణి క్యాథరిన్ ప్రథమ, సైన్సు అండ్ ఇన్నోవేషన్స్‌లో లలిత అండ్ గ్రూపు ప్రథమ స్థానాలు సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని చెప్పారు. విజేతలను చిట్టూరి వెంకట కృష్ణారావు, అభినందించారు.



ఖోఖో పోటీలకు సిద్ధం చేస్తున్న మైదానం

నేడు కైకరంలో ఖోఖో జిల్లా జట్టు ఎంపిక

ఉంగుటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు మండలం కైకరం జిల్లా పరిషత్తు పాఠశాల మైదానంలో మంగళవారం జిల్లా ఖోఖో జట్టు ఎంపిక పోటీలు జరుగుతాయని హెచ్ఎం గుళ్ళ ప్రసాదరావు తెలిపారు. సోమ వారం హైస్కూల్‌లో మూడు మైదానాలను సిద్ధం చేసినట్లు వివరించారు. ఈ క్రీడలకు ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జి.నాగసుధ వ్యవహరి స్తున్నారు. జిల్లాలోని 650 మంది క్రీడా కారులతో పాటు 40 మంది వ్యాయామ ఉపా ధ్యాయులు పాల్గొంటారని వివరించారు.

పొరుగింటి కర్రీ రుచి

బంధువులు వస్తే కర్రీ పాయింటే దిక్కు



"కర్రీ పాయింట్‌లలో మూడు రకాల కూరలు తీసుకుంటే రూ.50 నుంచి రూ.70వరకు అవుతుంది. రూ.100కు ఒక్కపూట భోజనం రావడమే కష్టం. పెరిగిన కూరగాయల ధరల కన్నా కర్రి పాయింట్‌లలోనే తక్కువ ధరకు వస్తాయి. బంధువులు వచ్చిన సమయాల్లో కర్రి పాయింట్ కూరలు బెస్ట్..అని దుగ్గిరాలకు చెందిన రాజ్యలక్ష్మి చెప్పారు..

కూరగాయలు కొనలేని పరిస్థితి ..



"సాంబారు, రసం, పప్పు, ఇతర కూరలు రూ.50లకే వస్తున్నాయి. ఒక్కోసారి ఇంట్లో వంట చేసుకోలేని పరిస్థితి. కర్రీపాయింట్ అక్షయ పాత్రగా మారుతుంది. ఉద్యోగ రీత్యా ఒక్కోసారి వంట చేయటం కష్టంగా మారు తోంది. డ్యూటీకి వెళ్లినప్పుడు ఒక్కోసారి కర్రీ పాయింట్ల నుంచే కూరలు కొనేస్తాను.."అని చెబుతున్నారు శనివారపుపేటకు చెందిన సునీత..

ఉరుకుల పరుగుల జీవితంలో వండుకుని తినేంత టైమ్ ఉండడం లేదు. ప్రశాంతంగా తినే సమయం అసలే లేదు. దీంతో ఎక్కడి కక్కడే కర్రీ పాయింట్స్ వెలిశాయి. చేసుకుని తినే ఓపిక లేనివారు వీటిని ఆశ్రయిస్తున్నారు. ఇప్పుడున్న రేట్లకు కర్రీ పాయింట్ కూరలే బెస్ట్ అని అంటున్నారు. మధ్యాహ్నం అయితే పట్టణాలు, పల్లెల్లో సైతం కర్రీ పాయింట్లు కిటకిటలాడుతున్నాయి. ఒక రకంగా చూస్తే ఇవి పలువురికి ఉపాధి మార్గాలుగా కూడా మారాయి. గతంలో అన్నిరకాల కూరలు వంటింట్లో చేసుకుని తినేవారు. ప్రస్తుతం ఉరుకుల పరుగుల జీవితంలో ఎవరికీ వండుకుని తినేంత టైమ్ కూడా ఉండటం లేదు. అమ్మచేతి వంటను కాదని ఇప్పుడు తక్కువ ధరకే వస్తున్నందున కర్రీ పాయింట్ల వెంట పరిగెడు తున్నారు. తమకు వీటి ద్వారా ఉపాధి దొరికిందని పలువురు మహిళలు తెలుపుతున్నారు. కర్రీస్ పాయింట్స్‌లో మాంసా హారం, శాఖా హారంకు సంబంధించిన కూరలు వేరువేరుగా విక్రయి స్తున్నారు. రూ.20 నుంచి కూరలు అంది స్తున్నారు. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో అధికంగా కొనుగోళ్ళు జరుగుతున్నాయని యజమానులు చెబుతున్నారు. పలు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, రోజుకూలీలకు కర్రీ పాయింట్లు వరంగా మారాయి. 20 నుంచి 40 వరకు వెరైటీలు అమ్మకాలు చేస్తు న్నారు. కర్రీపాయింట్ల వల్ల అధిక శాతం ఉద్యోగస్తులు ఇళ్లల్లో వంటలు చేయడమే మానేశారని పలువురు ఉద్యోగులు ర్కొన్నారు. ఇంట్లో వండితే ఒకటే కూర.. కర్రీ పాయింట్లో రెండు, మూడు రకాలు తినవచ్చు అనడం విశేషం. **- ఏలూరు రూరల్**





ఏలూరులో కర్రీ పాయింట్

భళా.. బాల మేధావులు

- నమూనాలు తయారు చేసిన గురుకులం విద్యార్థులు
- నువ్వా.. నేనా అంటూ అదరగొట్టిన చిన్నారులు
- ద్వారకాతిరుమలలో ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన

సెన్సార్‌తో ఓటేద్దాం



ఓటు హక్కును ఎటువంటి భయం లేకుండా ఐఆర్ సెన్సార్ ద్వారా వినియోగించుకునే విధానాన్ని తెలియజెప్పేలా విద్యార్థులు రూపొందించారు. టాంపరింగ్‌లు లేకుండా మనం అనుకున్న వ్యక్తి గుర్తుపై చేయిపెడితే సెన్సార్ ద్వారా ఓటు నమోదు అవుతుంది. దీనిని వట్లూరు గురుకులం బాలికల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న గంటా సుష్మ, పొన్నూరి చాందిని తయారు చేశారు.

ద్వారకాతిరుమలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో సోమవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ విజ్ఞానదాయకంగా ఉన్నది. పిల్లల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇది ఎంతగానో తోడ్పడుతుంది. విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సోమవారం జరిగిన ప్రదర్శనలో పలు జిల్లాలలోని గురుకులం పాఠశాలల నుంచి సీనియర్, జూనియర్ విభాగాల్లో మొత్తం 114 మంది విద్యార్థులు 58 ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. గురుకులం పశ్చిమ, కృష్ణా, తూర్పు గోదావరి జిల్లాల సమన్వయకర్తలు ఎస్.భారతి, కె.ప్రేమావతి, జి.వెంకట్రావు, జడ్పీటీసీ శామ్యూల్, సర్పంచ్ సావిత్రి, ఎంఈవో వెంకట్రావు, పి.విజయభారతి తదితరులు ప్రదర్శనలు తిలకించి విద్యార్థులను అభినందించారు.

– ద్వారకాతిరుమల

భూగర్భ జలాలు పెంచేద్దాం..



ప్లాస్టిక్‌తో అనర్థాలు అన్నీ ఇన్ని కావు. సకల ప్రాణులు ప్లాస్టిక్‌తో ఇబ్బంది పడుతు న్నారు. భూమి పొరల్లో ప్లాస్టిక్ అడ్డుపడటం వల్ల భూగర్భ జలాలు పెరిగే పరిస్థితి లేదు. భూమిలోకి ప్లాస్టిక్‌ను నియంత్రించడంతోపాటు భూగర్భ జలాలను పరిరక్షించడం ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశ్యం. మొక్కలను ఎక్కువగా పెంచాలని, ఫ్యాక్టరీల నుంచి వచ్చే కలుషిత నీరు నదుల్లోకి రావడం వల్ల అదే నీటిని వ్యవసాయానికి వినియోగిస్తే భూమి సారాన్ని కోల్పోయి పంట నష్టం కలుగుతుందని చెప్పారు. దీనిని కొవ్వూరు గురుకులంకు చెందిన జె అబిల, వై.దీవెన కుమారి రూపొందించారు.

మహిళా రక్షణపై



ద్వారకాతిరుమల గురుకులంలో చదువుతున్న భీమడోలు గుణశ్రీ, జీఎల్ఎస్ గౌతమి డెమో ఆకట్టుకునే విధంగా ఉన్నది. మహిళా సంరక్షణ చట్టాలు, బాలిక కనీస వివాహ వయస్సు అత్యవసర నెంబర్లు 181, 112, 100 పై వివరించారు. అలాగే 18 ఏళ్ల నిండకుండా బాలికకు వివాహం జరిపితే తల్లితండ్రులకు లేదా సంరక్షకులకు బాల్యవివాహ నిరోధ చట్టం ప్రకారం శిక్ష ఉంటుందని చెప్పారు. దీన్ని చూపుతూ డెమో ప్రదర్శించారు.

చెత్తను తెస్తే చాలు..



చెత్తకుండీకి అల్ట్రాసోనిక్ సెన్సార్‌ను అమర్చారు. చెత్తను వృద్ధులు, గర్భిణులు వంటి వారు పెద్దగా కష్టపడకుండా చెత్తను దాని దగ్గరకు తెస్తే అదంతట అదే ఓపెన్ అవుతుంది. చెత్తను అందులో వేసిన వెంటనే క్లోజ్ అవుతుంది. దీని ఖర్చు రూ.200 లోపే.. అని పామర్రులోని గురుకులంలో 8వ తరగతి చదువుతున్న మహ్మద్ అర్షప్ తయారు చేశాడు. దీనిని షాపింగ్ మాల్స్ ఆసుపత్రిలు, పాఠశాలల్లో వాడొచ్చు.

ఆకులపై బొమ్మలు



ఆకులు, పేపర్‌ప్లేట్‌లు, థర్మో కోల్, అరటి డొప్పలు, వేరుశెనగ తొక్కలు, ఖాళీ సీసాలు, ఐస్‌క్రీమ్ పుల్లలు వంటి వాటిని ఉపయోగించి అనేక బొమ్మలు తయారుచేశారు. తామరాకులపై అంబేడ్కర్, గౌతమబుద్ధుడు, గాంధీ, బోసు వంటి మహనీయుల చిత్రాలను లీఫ్ ఆర్ట్ పేరిట రూపొందించారు. ఖాళీ బాటిళ్లపై వివిధ ప్రకృతి చిత్రాలను గీచి అబ్బురపరిచారు. పేపర్‌ప్లేట్లను, వేరుశెనగ తొక్కలను వినియోగించి కళాత్మక చిత్రాలను వేశారు. వీటిని గోపాలపురంకు చెందిన విద్యార్థులు ఎం.సంజన, కె. గీతిక తయారుచేశారు.





ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి రామానాయుడు, అంగర

సభ్యత్వ నమోదులో పాలకొల్లు ముందుండాలి

మంత్రి రామానాయుడు

పాలకొల్లు టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం నమోదు ప్రక్రియను వేగవంతం చేసి రాష్ట్రంలోనే పాలకొల్లు నియోజకవర్గం ముందుండాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సోమవారం పాలకొల్లులో జరిగిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్డీయే బలపర్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని సమష్టిగా పనిచేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముందుగా స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ తదితరులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కేవలం రూ.100తో సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలందరికీ ఆర్థిక భరోసా కల్పించడం జరిగిందన్నారు. ఈసభలో ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు పెచ్చెట్టి చంద్రమౌళి తదితరులు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల భద్రత, సంక్షేమం, ఆర్థిక భరోసా కల్పించడమే ధ్యేయంగా అధినేత చంద్రబాబునాయుడు సభ్యత్వ నమోదును గురుతర బాధ్యతగా తీసుకున్నారని వెల్లడించారు. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పెన్మెత్స రామభద్రరాజు, జిల్లా టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు, రాష్ట్ర టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి, పట్టణ, మండలాల అధ్యక్షులు జీవీ, మామిడిశెట్టి పెద్దిరాజు, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, కోడి విజయభాస్కర్, రాష్ట్ర టీడీపీ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి దాసరి రత్నరాజు, బీసీసెల్ కార్యదర్శి బందెల భాస్కరరావు, నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మునిసిపల్ టీచర్లకు ప్రమోషన్లు



ఏలూరు అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు తీపికబురు. ఏళ్ళతరబడి బదిలీలు, పదోన్నతుల కోసం డిమాండ్ చేస్తున్న మునిసిపల్ టీచర్ల ఆకాంక్షలకు కార్యరూపమిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఆ మేరకు మునిసిపల్ టీచర్ల పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించాల్సిందిగా ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనికనుగుణంగా ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లా ప్రాతిపదికగా ఏలూరుజిల్లా డీఈవో నేతృత్వంలో పదోన్నతుల ప్రక్రియను చేపట్టారు.

ఉమ్మడి జిల్లాలోని ఏలూరు కార్పొరేషన్, నిడదవోలు, నరసాపురం, తణుకు, భీమవరం, తాడేపల్లిగూడెం, కొవ్వూరు, పాలకొల్లు మునిసిపాలిటీల్లో మొత్తం 230 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలుండగా, వీటిలో సుమారు 1400మంది టీచర్లు పని చేస్తున్నారు. కూటమిప్రభుత్వం కొలువుతీరాక చేపడుతున్న మెగా డీఎస్సీ-2024 రిక్రూట్‌మెంట్‌లో మునిసిపల్ పాఠశాలలకు చెందిన టీచర్ పోస్టుల్లో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ కేడర్ల నుంచి దాదాపు 260 వెకెన్సీలను చేర్చినట్టు సమాచారం. మెగా డీఎస్సీకి చేర్చినవాటిలో 2025 మే నెలాఖరు వరకు ఏర్పడే వెకెన్సీలను కూడా చేర్చగా, ఇపుడు మిగతా ఖాళీలకు మాత్రమే పదోన్నతులను ఇచ్చేఅవకాశం ఉంది. దీనిపై విద్యాశాఖ నుంచి స్పష్టత రావాల్సిఉంది. వర్కింగ్ ఎస్జీటీల నుంచి తగిన అర్హతలున్నవారికి ఆయా సబ్జెక్టుల్లో అందుబాటులోవున్న ఖాళీలమేరకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు ఇవ్వడంద్వారా భర్తీచేయనున్నారు. ఆ ప్రకారం ఉమ్మడి జిల్లాలో ఏలూరు నగరపాలకసంస్థలో 7 హైస్కూళ్ళు, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, భీమవరం మునిసిపాలిటీల్లో 6 చొప్పున, నరసాపురం 5, నిడదవోలు 3, తణుకు, కొవ్వూరు మునిసిపాలిటీల్లో ఒకొక్కటి చొప్పున హైస్కూళ్ళలో అందుబాటులోవున్న ఖాళీల మేరకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పదోన్నతులు ఇవ్వడంద్వారా భర్తీచేస్తారు. జంగారెడ్డిగూడెం, ఆకివీడు మునిసిపాలిటీలుగా వర్గోన్నతి అయినప్పటికీ, ఇంతవరకు అక్కడి పాఠశాలలను మాత్రం పురపాలకశాఖ పరిధిలోకి రాష్ట్రస్థాయిలో తీసుకురాలేదు. మరోవైపు ఏలూరు కార్పొరేషన్ పరిధిలోకి పరిసర గ్రామాలను కూడా గతంలోనే చేర్చినప్పటికీ, సంబంధిత ప్రాంతాల్లోని స్కూళ్ళు మాత్రం పంచాయతీరాజ్ పరిధిలోనే కొనసాగుతున్నాయి. ఇక తాజాగా మునిసిపల్ పాఠశాలల టీచర్లకు ఇవ్వడానికి ఉద్దేశించిన పదోన్నతులు మెగా డీఎస్సీకి చేర్చిన పోస్టులను మినహాయిస్తే ఉమ్మడి జిల్లాలో సుమారు 14 వరకు మాత్రమే ఉంటాయని ప్రాథమిక అంచనా. ఈ పదోన్నతులు మునిసిపాలిటీ లవారీగా ఎన్నెన్ని ఉంటాయనేదానిపై ఒకటిరెండురోజుల్లో స్పష్టత రానుంది.

వచ్చే నెలలో ప్రమోషన్లు

అర్హులకు ప్రమోషన్లను నవంబరు మొదటి వారంలో ఇస్తారు. కాగా పదోన్నతుల ప్రక్రియ ప్రకారం ఉమ్మడిజిల్లాలోని మున్సిపల్ టీచర్ల సీనియార్టీ జాబితాలు సోమవారమే విడుదల కావాల్సిఉండగా, కొత్తగా బదిలీపై జిల్లాకు నియమితులైన ఎం.వెంకటలక్ష్మమ్మ ఇంకా బాధ్యతలు చేపట్టకపోవడంతో ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని జాబితాలను మంగళ లేదా బుధవారం విడుదలచేసే అవకాశం ఉంది. నూతన డీఈవో వెంకటలక్ష్మమ్మ జిల్లాలో బుధవారం విధుల్లో చేరతారని తెలిసింది.

మలేరియా సబ్ యూనిట్ అధికారి రాజ్‌కుమార్ మృతి

పాలకొల్లు రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నరసాపురం డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎం. రాజ్‌కుమార్ (56) గుండెపోటుతో సోమవారం ఆకస్మికంగా మరణించారు. రాజ్ కుమార్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రాజ్ కుమార్‌కు గుండెపోటు రావడంతో ఆదివారం పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా మెరుగైన చికిత్స నిమిత్తం భీమవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. రాజ్ కుమార్ మృతి పట్ల ఉమ్మడి జిల్లాల మలేరియా అధికారి డాక్టర్ ప్రసాదరావు, జిల్లా ఇన్‌చార్జి డిఎంవో డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్, ఏఎంవోలు పి శ్రీనివాసరావు, ఎం శ్రీనివాసరావు, లంకలకోడేరు పిహెచ్‌సి డాక్టర్ ప్రతాప్ కుమార్ సంతాపం వ్యక్తం చేశారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

లింగపాలెం, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి):మద్యం మత్తులో తనను భర్త వేధింపులకు గురిచేస్తున్నాడంటూ భార్య ఫిర్యాదు చేసిన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం ధర్మాజిగూడెం గ్రామానికి చెందిన కూరపాటి మారెమ్మను భర్త మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోవటం లేదని తరచూ మద్యం తాగి తనని కొడుతూ వేధింపులకు గురిచేస్తున్నాడంటూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రైమ్ కార్నర్

నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య

ఆగిరిపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగా లేక నిద్రమాత్రలు మింగి ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని అడవినెక్కలంలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. కూలి పనులు చేసి జీవించే లక్ష్మీ బాబు (43) కొంత కాలం నుంచి అనారోగ్యం కారణంగా సరిగా నిద్రపట్టక వైద్యుడి సూచనల మేరకు స్లీపింగ్ టాబ్లెట్లు వాడేవాడని 24న అధిక మోతాదులో నిద్రమాత్రలు మింగడం వల్ల అపస్మారక స్థితికి చేరుకోవడంతో విజయవాడ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ 27న మృతి చెందాడన్నారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు ఆగిరిపల్లి ఎస్సై శుభశేఖర్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కుక్కునూరు, అక్టోబరు 28: (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన కొప్పుల నరేష్ (33) సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుక్కునూరు ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నరేష్‌కి తన భార్య చెడుప్రవర్తన కలిగి ఉందని పలుమార్లు అనుమానించాడు. ఈ క్రమంలో ఆవేదనతో ఉరివేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి మృతి

ఉండి అక్టోబరు 28:(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ మహ్మద్ నజీరుల్లా అందించిన వివరాలు ప్రకారం.. పాందువ్వ గ్రామానికి చెందిన గుబ్బల సత్యనారాయణ(73) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దాంతో సోమవారం పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు చూసేసరికే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కార్మికుడిపై కేసు

అత్తిలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వరిగేడు శివారు యర్రనీలి గుంట గ్రామానికి చెందిన పేసెట్టి దేవ కృష్ణ మోహన్ అనే వ్యక్తిని కొట్టాడనే ఆరోపణపై కొబ్బరి దింపు కార్మికుడు కడలి నాగ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు అత్తిలి ఎస్ఐ పి.ప్రేమరాజు తెలిపారు. రెండు రోజుల క్రితం నాగశ్రీనివాస్ కొబ్బరి దింపు కోసం వెళ్ళాడు. కృష్ణ మోహన్ రెండు వందల రూపాయలు బకాయి పడడంతో శ్రీనివాస్ గొడవపడి గాయపరిచాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రెండేళ్లుగా చోరీలు

ఎట్టకేలకు దొంగల పట్టివేత.. 66 గ్రాముల బంగారం స్వాధీనం



నిందితులను చూపిస్తున్న భీమవరం డీఎస్పీ జయసూర్య

భీమవరం క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రెండు సంవత్సరాలుగా ఆకివీడు పోలీస్ స్టేషన్ పరిధిలో తాళాలు వేసిన ఇళ్ళల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను, అలాగే వారు దొంగిలించిన వస్తువులను కొనుగోలు చేస్తున్న ఒక కంపెనీ అసిస్టెంట్ మేనేజర్‌ను అరెస్టు చేసినట్లు భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య తెలిపారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆకివీడు రైల్వేస్టేషన్ రోడ్‌కు చెందిన ఆవాల వెంకన్నబాబు, జవహర్ పేటకు చెందిన వాన లక్ష్మణరావు కలిసి సుమారు 15 దొంగతనాల కేసుల్లో నిందితులుగా ఉన్నారు. సోమవారం ఆకివీడు ఎస్ఐ హనుమంతు నాగరాజు వెంకయ్యవయ్యేరు బ్రిడ్జి సమీపంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా వారిద్దరూ పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రెండు కేసుల్లో సుమారు 66 గ్రాముల బంగారు ఆభరణాలు నేరానికి ఉపయోగించే పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. ఆవాల వెంకన్నబాబు గతంలో ఒక ఏఎస్ఐని మోసం చేసిన కేసులో నిందితుడిగా జైలు కెళ్ళి అక్కడ ఉన్న నేరస్తుల పరిచయాలతో దొంగతనాలు ఎలా చెయ్యాలో తెలుసుకుని బయటకు వచ్చాక వాన లక్ష్మణరావుతో దొంగతనాలు ప్రారంభించాడు. ఈ కేసుల్లో ఇంకా 400 గ్రాముల బంగారు ఆభరణలు రికవరీ చెయ్యవలసి ఉందని డీఎస్పీ తెలిపారు.

బంగారం కొనుగోలు చేసిన వ్యక్తి అరెస్టు

ఆవాల వెంకన్నబాబు, వాన లక్ష్మణరావు దొంగతనం చేసిన బంగారాన్ని భీమవరం గునుపూడిలో ఉన్న డిఆర్‌యుగోల్డ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న అందేకుమార్ శ్రీ నాగవెంకట త్రినాథ్‌కు అమ్మడం ప్రారంభించారు. ఈ కేసులో ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. కంపెనీ ఆపరేషన్ మేనేజర్ శివకుమారి, కంపెనీ ఎండి అఖిలేష్ అగర్వాల్‌ను కూడా అదుపులోకి తీసుకోవల్సి ఉందని డీఎస్పీ తెలిపారు.

కూలిన భవనం పైకప్పు.. మహిళకు గాయాలు





కూలిన శిథిల భవనం పైకప్పు... గాయపడ్డ మహిళ

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థలో ఉన్న భవనం పైకప్పు కూలి మహిళకు గాయాలైన ఘటన తాడేపల్లిగూడెం పట్టణంలో సోమవారం చోటుచేసుకున్నది. పట్టణంలోని రేలంగి చిత్రమందిర్ సమీపంలోని 50 ఏళ్ల కిందటి శిథిల భవనం ప్రమాదకరంగా ఉంది. ఈ భవనం కూల్చాలంటూ మునిసిపల్ అధికారులు నోటీసులు ఇచ్చినా యాజమానులు స్పందించలేదు. అయితే ఆభనాన్ని అద్దెకు ఇస్తూనే ఉన్నారు. అక్కడ చిన్న వ్యాపారం చేసుకుంటున్న పూర్ణకుమారి మహిళపై భవనం పైకప్పు కూలి గాయాలయ్యాయి. ఆ శిథిలాలకింద మరో రెండు మోటారుసైకిల్స్ దెబ్బతిన్నట్టు తెలుస్తోంది. సంఘటనా స్థలానికి మునిసిపల్, పోలీస్ అధికారులు చేరుకుని సహాయక చర్యలు చేస్తున్నారు.

హోమాల పేరుతో రూ.37లక్షలకు టోకరా

మొగల్తూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సిద్ధాంతిపై కేసు నమోదు చేసినట్టు మొగల్తూరు ఎస్ఐ జి.వాసు తెలిపారు. పెనుమంట్ర మండలం మల్లిపూడి గ్రామానికి చెందిన పెచ్చెట్టి గోపాల కృష్ణకు కుక్కల శ్రీను అనే వ్యక్తి ద్వారా మొగల్తూరుకు చెందిన సిద్ధాంతి ఆముదాలపల్లి వెంకటాచార్యులు పరిచయం అయ్యాడు. ఏదైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తారని శ్రీను చెప్పడంతో సిద్ధాంతిని గోపాలకృష్ణ కలిసి తన సమస్యలు చెప్పాడు. సిద్ధాంతి మూడు రోజుల పాటు హోమం చేయాలని చెప్పాడు. దీనితో గోపాలకృష్ణ తన ఇంటిలో ఎవరికి చెప్పకుండా సిద్ధాంతి ఇంటికి వెళ్ళాడు. మూడు రోజులు గడిచినా సరే ఏ హోమం చేయకపోవడంతో తాను ఇంటికి వెళ్ళిపోతానని గోపాలకృష్ణ అన్నాడు. దీనికి సిద్ధాంతి నిరాకరించాడు. నీవు ఇంటికి వెళితే మీ ఇంటిలో అంద రూ చనిపోతారని బయపెట్టి 54 రోజులు వెంకటాచార్యులు ఇంటిలో నిర్బంధించాడన్నారు. దఫ దఫాలుగా గోపాలకృష్ణ నుంచి రూ.37లక్షల 50వేలు వెంకటాచార్యులు వసూలు చేసినట్టు గోపాలకృష్ణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

చీటింగ్ కేసు నమోదు

ఏలూరు క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): టైర్లు తీసుకువెళ్ళి సొమ్ములు ఇవ్వకుండా మోసగించిన ఇద్దరిపై ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరు పడమరవీధికి చెందిన మెరుగుమాల శ్రీనివాసరావు ఏలూరు ఆటోనగర్‌లో టైర్ల షాపు నిర్వహిస్తున్నారు. గన్నవరానికి చెందిన అజిత్ సాయిబాబా పరిచయం అయ్యాడు. తమ స్నేహితుడు విఎన్ గుప్తా గన్నవరంలో టైర్ల షాపు పెడుతున్నాడని కొంత సరుకు ఇవ్వాలని చెప్పడంతో రెండు లక్షల 21 వేల రూపాయల విలువైన టైర్లను శ్రీనివాసరావు ఇచ్చారు. డబ్బు ఇవ్వలేదు. వారిద్దరు ఉద్దేశ పూర్వకంగా మోసగించారని శ్రీనివాస రావు ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థిపై బీరు సీసాతో దాడి

భీమవరం క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య జరిగిన చిన్నపాటి తగాదాలో ఒక విద్యార్థిపై బీరుసీసాతో దాడి వరకు వెళ్ళింది. భీమవరం టూటౌన్ ఎస్ఐ పాజిల్ రహమాన్ తెలిపిన వివరాలు ప్రకారం.. పట్టణంలోని ఒక ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం జూనియర్, సీనియర్‌లు మధ్య చిన్నపాటి తగదా జరిగి ఇరువురు గెంటుకున్నారు. అనంతరం ఇంటికి వెళుతున్న సమయంలో రాయలం గ్రామ సమీపాన మేకా యశ్వంత్ అనే 4వ సంవత్సరం బిటెక్ విద్యార్థిపై కొంతమంది బీరు సీసాతో దాడి చేసి గాయపర్చగా ఆ విద్యార్థి ప్రస్తుతం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.



కవ్వగుంటలో రహదారిపై ఆందోళన చేస్తున్న స్థానికేతరులు

భద్రత కరువైందని స్థానికేతరుల ఆందోళన

పెదవేగి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలు దాటి ఉపాధి కోసం వచ్చిన మాపై స్థానికంగా ఉండే కొంతమంది దాడులు చేస్తూ, భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వారినుంచి రక్షణ కల్పించాలంటూ శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాలకు చెందిన వ్యక్తులు రహదారిపై ఆందోళనకు దిగారు. పెదవేగి మండలం కవ్వగుంటలో సోమవారం ఉదయం స్థానికేతరులైన బీసీ సామాజిక వర్గానికి చెందిన వందమందికిపైగా కవ్వగుంట రహదారిపై ధర్నాకు దిగారు. ఈ సమయంలో రహదారిపై రాకపోకలు నిలిచిపోవడం, సమాచారం అందుకున్న పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు, ఎస్ఐ కె.రామకృష్ణలు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారిని సముదాయించారు. అయితే ఆందోళన చేస్తున్న వ్యక్తులు మాత్రం ఎంతకూ పట్టు వీడకుండా తమకు న్యాయం జరిగే వరకు కదిలేది లేదని భీష్మించారు. రెండుగంటలకు పైగా నిరసన వ్యక్తంచేశారు. 40ఏళ్ళుగా ఇక్కడే ఉంటూ, కూలీపనులతో జీవనం సాగిస్తున్న మాపై గడచిన నాలుగేళ్ళుగా స్థానికులు దాడులు చేస్తున్నారని, ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం ఉండడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై అలాంటి జరుగకుండా చూస్తామని పోలీసులు ఇచ్చిన హామీతో ఆందోళన విరమించారు.

గోదావరిలో హాస్టల్ వార్డెన్ గల్లంతు



కొండ్రు రామిరెడ్డి (ఫైల్‌ఫొటో)

కొవ్వూరు/గోపాలపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరులో హాస్టల్ వార్డెన్ గోదావరిలో మునిగి గల్లంతయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం.. పోలవరం గ్రామానికి చెందిన కొండ్రు రామిరెడ్డి(58) గోపాలపురం ఎస్సీ హాస్టల్‌లో వార్డెన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం హాస్టల్లో హెల్పర్‌గా పనిచేస్తున్న మర్రి శ్రీనివాసుతో కలిసి కొవ్వూరు యానాది కాలనీలో ఫంక్షన్‌కు వచ్చాడు. భోజనం అనంతరం గోష్పాదక్షేత్రం వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగాడు. ప్రమాదవశాత్తూ రామిరెడ్డి నదిలో మునిగి గల్లంతయ్యాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

యువకుడి మృతదేహం లభ్యం

యలమంచిలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కత్తిమండ గ్రామానికి చెందిన పెచ్చెట్టి ఏసురాజు(32) మృతదేహం బాడవ వద్ద గోదావరిలో సోమవారం లభ్యమైందని ఎస్ఐ కె.గుర్రయ్య తెలిపారు. ఏసురాజు చించినాడ బ్రిడ్జిపై చెప్పులు, ఫోన్ నంబరు రాసి ఉన్న కాగితం పెట్టి శనివారం నుంచి కనిపించకుండా పోయిన సంగతి పాఠకులకు విదితమే. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

వండకుండానే బొక్కేస్తున్నారు..!

(ఐదో పేజీ తరువాయి)

వెళుతుంటారు. ఒక్కో మోటారు సైకిల్‌పై రెండు క్వింటాళ్లకు పైగా కొనుగోలు చేసి తరలిస్తారు. చెక్ పోస్టుల్లో వీరిని కనీసం నిలువరించరు. ఇలా సేకరించిన వ్యక్తి పెద్ద వ్యాపారికి, అక్కడి నుంచి రైస్ మిల్లులకు తరలిస్తుంటారు. ఆ బియ్యం మొత్తం జాతీయ రహదారిపై నుంచే తరలించడం అందరికీ తెలిసిన విషయమే. కానీ ఎక్కడా వారిని అడ్డుకోరు. ఇలా ఎవరు తరలిస్తున్నారో, ఎక్కడికి తరలిస్తున్నారో అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆరిమిల్లి

తణుకు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై కార్యదర్శులు దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడుతూ లోఓల్టేజి సమస్య పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మండల ప్రత్యేకాధికారి హరిగోపాల్, మండల పరిషత్ పరిపాలనాధికారి పి.పూర్ణచంద్రరావు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని వినతి

పాలకొల్లు అర్బన్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు-ఆచంట నియోజకవర్గాలను కలిపుతున్న రోడ్డు పెనుమదం వద్ద ఛిద్రమైందని నిర్మించాలని కోరుతూ మాలమహానాడు నాయకులు మంత్రి నిమ్మల రామానాయుడుకు సోమవారం మంత్రి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. మాల మహానాడు అధ్యక్షుడు పుష్పరాజు, జిల్లా కార్యదర్శి సిహెచ్.రాజ్‌కుమార్, కె.ప్రసాదరావు ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు జిల్లా స్థాయి అవార్డులు

పాలకొల్లు. అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏఎస్ఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)కు మూడు జిల్లా స్థాయి అవార్డులు వచ్చినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. జిల్లా యువ సర్వీసులు, సెట్వెల్ ఆధ్వర్యంలో ఈ నెల 26న తణుకులో నిర్వహించిన యువజన సంబరాలలో జిల్లాలోని 12 కళాశాల విద్యార్థులు పాల్గొన్నారని, దీనిలో తమ కళాశాల విద్యార్థులు వి వెంకట్ వక్తృత్వ పోటీలో ద్వితీయ బహుమతిని, మహాలక్ష్మీ పెయింటింగ్‌లో తృతీయ స్థానం, జానపద బృంద నృత్యంలో పాల్గొన్న ఆరుగురు విద్యార్థుల బృందానికి తృతీయ స్థానం లభించిందని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు

విష్ణు కళాశాల విద్యార్థుల విజయకేతనం

భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : విష్ణు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన టైగ్రేడ్ బిజినెస్ ఇండియా-2024 టోర్నమెంట్‌లో మొదటి బహుమతి సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వేణు తెలిపారు. ఈ పోటీలో 112 కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారని, విష్ణు కళాశాల టీమ్ మొదటి బహుమతి సాధించడం గర్వకారణమన్నారు. విజేత జటుకు రూ.లక్ష నగదు బహుమతి అందించడంతో పాటు అమెరికాలో జరిగే సదస్సుకు హాజరవుతారన్నారు. విజేతలను కళాశాల ఇన్స్టిట్యూట్ కౌన్సిల్ ప్రెసిడెంట్, మెంటార్ డాక్టర్ వీఎస్ఎన్ నరసింహరాజు, చైర్మన్ విష్ణురాజు, వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, సెక్రటరీ ఆదిత్య విస్సం, డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) ప్రసాదరాజు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీలక్ష్మీ, తదితరులు అభినందించారు.

జనసేనలో చేరికలు

తాడేపల్లిగూడెంఅర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు వి.కాశి అధ్యక్షతన జువ్వలపాలెంకు చెందిన సుమారు వంది మంది సోమవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సమక్షంలో జనసేనలో చేరగా బొలిశెట్టి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సెక్యులరిజాన్ని కాపాడాలి

గణపవరం, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): దేశంలో సెక్యులరిజం పరిరక్షణకు విద్యార్థులంతా పోరాడాలని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నిర్మలకుమారి పిలుపునిచ్చారు. జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

రోడ్డా.. డంపింగ్ యార్డా..

- చెత్తా చెదారంతో అధ్వానంగా పాలకోడేరు-మోగల్లు రోడ్డు
- దుర్వాసన భరించలేమంటున్న ప్రయాణికులు



పాలకోడేరు - మోగల్లు ఆర్‌అండ్‌బీ రోడ్డులో వేసిన చెత్తా చెదారం

పాలకోడేరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో రహదారులే డంపింగ్ యార్డుల్లా మారి పోయాయి. పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు, పంచాయతీలకు ఆదాయాన్ని పెంచే విధంగా ప్రభుత్వాలు పలు సూచనలు చేస్తున్నాయి. దీనిలో భాగంగానే తడి,పొడి చెత్త వేరువేరుగా ఇళ్లలోనే వేసే విధంగా ప్రభుత్వం రెండు ప్లాస్టిక్ డబ్బాలను కూడా ఇంటింటికి సరఫరా చేసింది. అక్కడ వరకు బాగానే ఉన్న పంచాయతీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో అవి సఫలీకృతం కాకుండా పోయాయి. పంచాయతీ కార్మికులు ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించి ఆ చెత్తను ట్రాక్టర్లు, ఆటోల ద్వారా రహదారి మార్జిన్‌లో వేస్తున్నారు. దీంతో కాల్వలను పాడు చేస్తూ ఇటుగా వెళ్లే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలుగజేస్తున్నారు.

పాలకోడేరు పంచాయతీ పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఈ పంచాయతీలో ఘన వ్యర్థాల నిర్వాహణ కేంద్రం ఉన్నప్పటికి సరిగా నిర్వహించకపోవడంతో పంచాయతీ కార్మికులు గ్రామంలో ఉన్న చెత్తనంతా తీసుకొచ్చి పాలకోడేరు, మోగల్లు రహదారిలో వేస్తున్నారు. ఈ రహదారి వెంబడే హిందూ, క్రైస్తవుల శ్మశాన వాటికలు ఉన్నాయి. అయినప్పటికి అధికారుల నిర్లక్ష్యంతో ఆ చెత్తను సంవత్సరాల తరబడి రోడ్డుపక్కన వేస్తున్నారు. పంచాయతీ ఆదాయాన్ని పెంచే విధంగా ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తే పంచాయతీకి ఆదాయం రావడమే కాకుండా రహదారులు కూడా శుభ్రపడతాయని తద్వారా గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని ప్రజలు అంటున్నారు.

పశుగణనతో పాడి రైతులకు మేలు



పశుగణన మాన్యువల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, అక్టోబరు 28,(ఆంధ్రజ్యోతి): పశుగణనతో పాడి రైతులకు మేలు జరిగేలా చూడాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులకు సూచించారు. పాలకొల్లు క్యాంపు కార్యాలయంలో సోమవారం పశుగణన మాన్యువల్ బుక్‌ను ఆవిష్క రించారు. ఆయన మాట్లాడుతూ పశుగణన సక్రమంగా లెక్కించాలన్నారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు సి.మల్లేశ్వర రావు, పి.దయాకర్ జాన్సన్, మండల పశుసంవ ర్ధక శాఖ అధికారులు పి.చంద్రశేఖర రెడ్డి, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

- పోడూరు : ప్రతీ ఇంటికీ వెళ్లి పశుగణన నమోదు చేయాలని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సూచించారు. కొమ్ముచిక్కాల క్యాంపు కార్యాలయంలో సర్వే బుక్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం పశుసంవర్ధక శాఖ అధికారులు, సర్వే సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పశుసంవర్ధక శాఖ ఏడీఏలు పి.జయకర్ జాన్సన్, ఎం.ప్రమీలరాణి, పశు వైద్యులు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.
- ఆచంట : స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద 21వ అఖిల భారత పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యులు యు.సురేష్‌బాబు, జి.శ్రీరాములు, కె.మీరయ్య, టి.ప్రసాద్, మండల కోశాధికారి పణికుమార్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

పెంటపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. దర్శిపర్రులో సచివాలయ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఫిల్టర్‌బెడ్ పనులకు శంకుస్థాపన చేసి జడ్పీ హైస్కూలులో సరస్వతి, అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోలా శేషవేణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో గ్రామాల అభివృద్ధి శూన్యమన్నారు.

రోడ్డు మరమ్మతులు నాణ్యతగా చేపట్టాలి

రోడ్డు మరమ్మతులు నాణ్యతగా ఉండాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. ప్రత్తిపాడు నుంచి కృష్ణయ్యపాలెం వరకు చేపట్టిన రహదారి మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి రూ. వంద కోట్లు మంజూరు చేయాలని సీఎంను అభ్యర్థించగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఆయా కార్యక్రమాలలో ఉపసర్పంచ్ కోలా మార్కండేయులు, పుల్లా బాబి, కోడే కాశి, ఎంఈవో టీవీ రామకృష్ణ చెరుకూరి జగత్ సోమశేఖర్, మజ్జి అప్పారావు, మట్టా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికల అభివృద్ధికి కృషి



సిద్ధాంతం శ్మశాన వాటిక మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పితాని

పెనుగొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సిద్ధాంతం శ్మశాన వాటిక సోమవారం వివిధ శాఖల అధికారులతో కలిసి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పరిశీలించారు. శ్మశానవాటికను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడానికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు, దాతలు తోడ్పాటు అందించాలన్నారు. గోదావరి పక్కన పంచాయతీకి చెందిన 25 ఏళ్ళ క్రితం 2.32 ఎకరాల భూమి ఒక దళారి నుంచి కొనుగోలు చేసి,ఇప్పటి వరకు స్వాధీనం చేసు కోలేదని ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకువచ్చారు. నిజనిర్ధారణ చేయాలని అధికారులను ఆదేశించారు. వీబీఆర్ ప్రసాద్, యు.సత్యనారాయణ, సీహెచ్.గనిరాజు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలించిన పితాని

పెనుమంట్ర : మార్టేరు నుంచి పాలకొల్లు వరకు రూ.25 కోట్లతో నిర్మించనున్న రోడ్డు పనులను ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సోమవారం పరిశీలించారు. మార్టేరులో 700 మీటర్ల సిమెంట్ రోడ్డు రూ.1.25 లక్షలతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. నాణ్యత ప్రమాణాలతో రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆర్ అండ్‌బీ అధికారులను ఆదేశించారు. వచ్చే రెండు మూడు నెలల్లో రోడ్ల నిర్మాణం చేపడతామ న్నారు. ఏఈ ప్రసాద్, డీఈ వరలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరెడ్డి, కె.శ్రీనివాస రెడ్డి, టి.రాజారెడ్డి కె.భాస్కరరావు, ఎస్‌కె అలీ, కేబీవీ కుమార్, వెలగల బ్రదర్స్ పాల్గొన్నారు.

ప్రతి వినతిని పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో దాసిరాజు

నరసాపురం టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని అధికారులు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆర్డీవో దాసిరాజు సూచించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ సమస్య పరిష్కారం అవుతుందా? లేదా అన్న విషయాన్ని ఫిర్యాదుదారులకు స్పష్టంగా తెలపాలన్నారు. ఇటు ఫిర్యాదుదారులు మండల స్థాయిలోనే అధికారులకు విన్నవించి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.

- ఆకివీడు : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మూడు ఆర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.
- భీమవరం అర్బన్ : జిల్లాలో అధ్వానంగా ఉన్న రోడ్ల నిర్మాణం తక్షణమే చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.భీమారావు కలెక్టర్ చదలవాడ నాగరాణికి వినతిపత్రం అందజేశారు. రోడ్లపై పడిన గోతుల్లో వాహనాలు తిరగబడి పలువురు తీవ్ర గాయాలపాలవుతున్నారని వాపోయారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కె.వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాంప్రసాద్, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సీవీ కుమారి, జిల్లా సమితి సభ్యులు కె.గొల్లయ్య, వైవీ ఆనంద్, సుందర్ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో భరోసా



ముత్యాలపల్లిలో సభ్యత్వ నమోదు చేస్తున్న రామరాజు

మొగల్తూరు, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వం భవిష్యత్‌కు భరోసాగా నిలుస్తుందని పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పి.రామరాజు అన్నారు. ముత్యాలపల్లిలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మండల పార్టీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి కె.బాలకృష్ణ, బీసీసెల్ మండల అధ్యక్షుడు కె.మూలాస్వామి పాల్గొన్నారు.

- పాలకొల్లు అర్బన్ : పట్టణంలోని 8వ వార్డులో నిర్వహించిన టీడీపీ సభ్యత్వాల నమోదులో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కె.రోజారమణి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కె.గౌరునాయుడు, మహిళ కార్యకర్తలు ఎం.మహాలక్ష్మీ, ఆర్.రమాదేవి పాల్గొన్నారు.

నేడు పంజా సెంటర్‌లో సభ్యత్వ నమోదు

నరసాపురం టౌన్ : పట్టణంలోని పంజా సెంటర్‌లో మంగళవారం సభ్యత్వ నమోదు చేస్తున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యద ర్శులు జి.శ్రీమన్నారాయణ, కె.పెద్దిరాజు తెలిపారు.

సమస్యలు లేకుండా చూడాలి

కాళ్ళ అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలని ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు సూచించారు. కాళ్ళ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వ సభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. జెడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీలు ఎస్.పద్మారాణి, ఎం.నాగలక్ష్మీ, సర్పంచ్‌ల చాంబర్ జిల్లా అధ్యక్షుడు కె.ధర్మరాజు, ఎంపీడీవో జి.స్వాతి, తహసీల్దార్ జి.సుందర్‌సింగ్, హౌసింగ్ డీఈ శివరామరాజు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ

భీమవరం క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. భీమవరం పట్టణంలోని టౌన్‌హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ రక్తదాన విషయంలో అపోహ వద్దని ప్రతీ ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలన్నారు. రక్తదానం చేసిన 63 మందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు, జ్యూస్, బిస్కెట్లు అందజేశారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ, భీమవరం సబ్ డివిజన్ డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వి.పుల్లారావు, ఆర్మ్డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకట్రావు పాల్గొన్నారు.

- నరసాపురం : అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో పోలీస్, రెడ్‌క్రాస్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎస్పీ మురళీకృష్ణ ప్రారంభించారు. 53 మంది రక్తదానం చేశారు. సీఐలు యాదగిరి, దుర్గాప్రసాద్, ఎస్సైలు ముత్యాలరావు, జయలక్ష్మి, సురేష్, ఏఎస్సై నాగరాజు పాల్గొన్నారు.
- తాడేపల్లిగూడెం రూరల్ : పట్టణంలోని మాగంటి కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై నాగరాజుతోపాటు సిబ్బంది రక్తదానం చేశారు. డీఎస్పీ డి. విశ్వనాథ్ పాల్గొన్నారు.

కార్మికులపై పని భారం తగ్గించాలి



భీమవరంలో ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

భీమవరం అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలో కార్మికుల సంఖ్య పెంచి పని భారం తగ్గించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సమ్మె ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో భీమవరం పురపాలక సంఘం ఆఫీస్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు అన్నారు. యూనియన్ అధ్యక్షుడు ఎస్.రాజు, నాయకులు పాల్గొన్నారు

- తణుకు : మున్సిపల్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించారు. పట్టణ విస్తరణకు అనుగుణంగా కార్మికులను పెంచాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ కోరారు. సీఐటీయూ నాయకులు ఎ.అజయకుమారి, జి.రంగారావు, కృష్ణబాబు, ముందులయ్య, రాణి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

తణుకు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆటోలు, వాహనదారులు నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్‌ఐ ఆదినారాయణ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా సోమవారం పట్టణంలో వాహదారులను ఆపి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని ఎస్‌ఐ ఆదినారాయణ సూచించారు.

సేంద్రియ సాగుపై శిక్షణ

నరసాపురం రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చిట్టవరంలోని రైతు సేవా కేంద్రంలో సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ శాఖ సిబ్బందికి సోమవావారం శిక్షణ నిర్వహించారు. భీమవరం డీపీఎం నూకరాజు, ఏడీఈ అనిల్‌కుమారి విచ్చేసి ప్రకృతి వ్యవసాయం చేస్తే కలిగే ప్రయోజనాలుతో పాటు భూమికి మానవ మనుగడకు మేలు జరుగుతుందన్నారు. రైతులందరీ చేత ఎరువులు, పురుగుల మందుల వినియోగం తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించేలా అవగాహన కల్పించాలన్నారు. ఏవో జాన్సన్, దేవి, ఏఈవోలు, వీఏఏలు, వీహెచ్‌లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

తణుకు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో పాటు ప్రభుత్వ వ్యవసాయ పథకాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని సహాయ సంచాలకులు ఎంవీ రమేష్ అన్నారు. రైతులు, వ్యవసాయ సిబ్బందికి సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్ర మంలో ప్రకృతి వ్యవసాయం డీపీఎం నూకరాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో జీవ ఎరువులు రైతులు ఎలా వాడాలో వివరించారు. పంటను పురుగులు ఆశిస్తే ఆ వివరాలు సీఎల్ఎస్ యాప్‌లో నమోదు చేయాలో ఏవో కుసుమ తెలిపారు.

బాధిత కుటుంబానికి సాయం

అత్తిలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి గొల్లదిబ్బ వీధిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన కొంగరావు ఆంజనేయులు కుటుంబానికి తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ రూ. ఐదు వేలు సాయం అందజేశారు. ప్రభుత్వ పరంగా సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ డి.వంశీ, టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.ఆదినారాయణ, మాజీ ఎంపీపీ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

సేవకు వయస్సుతో సంబంధం ఉండదు

కలెక్టర్ నాగరాణి



సాయిబాబుకి మోటార్ సైకిల్ అందిస్తున్న కలెక్టర్

భీమవరం టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) సేవ చేయాలన్న మనసు ఉంటే వయసు అడ్డుకాదని, ఎనిమిది పదుల వయస్సులో ఉదయ్యావర్ తిరువది చారిటబుల్ ట్రస్ట్ సభ్యుల సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. స్థానిక కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో ఉదయ్యావర్ ట్రస్ట్ సభ్యులు సోమవారం కలెక్టర్‌ని కలిసి ట్రస్ట్ కార్యక్రమాలను వివరించారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ 80 ఏళ్ల వయసులో దేశం మొత్తం తిరిగి సాయం చేయాలనే సంకల్పానికి అభినందనలు తెలిపారు. బృందం సభ్యులు కలెక్టర్‌ను సత్కరించారు.

దివ్యాంగునికి మోటార్ సైకిల్ అందజేసిన కలెక్టర్

తాడేపల్లిగూడెం నివాసి కె.సాయిబాబు స్థానిక కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నానని 90 శాతం పైగా వికలాంగత్వం ఉన్న తాను కాలేజీకి వెళ్లి రావడం కష్టంగా ఉందని మోటార్ సైకిల్ ఇప్పించవలసిందిగా ఈ నెల 7న కలెక్టరేట్‌లో జరిగిన మీకోసం కార్యక్రమంలో దరఖాస్తు చేసుకుంటూ కలెక్టర్‌ను అభ్యర్థించారు. స్పందించిన కలెక్టర్ నాగరాణి సిహెచ్.కృష్ణంరాజుకు తెలపగా లయన్స్ క్లబ్ నుంచి రూ.1.20 లక్షలను సమకూర్చి మూడు చక్రాల వాహనాన్ని సోమవారం కలెక్టర్ చేతుల మీదుగా సాయిబాబాకు అందజేశారు. కృష్ణంరాజు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పి.మూర్తిరాజును కలెక్టర్ నాగరాణి సన్మానించి, అభినందించారు. జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, లయన్స్ క్లబ్ సెక్రటరీ జీఎం కృష్ణారావు, డైరెక్టర్ కె.రామచంద్రరావు పాల్గొన్నారు.

డీఆర్వోకు వీడ్కోలు సత్కారం

కలెక్టరేట్ వశిష్టా సమావేశ మందిరంలో నెల్లూరు జిల్లాకు డీఆర్‌వోగా బదిలీపై వెళ్తున్న జె.ఉదయభాస్కర రావును కలెక్టర్ నాగరాణి, జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి శాలువా కప్పి, సత్కరించారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ వరదలకు సహాయ కార్యక్రమాలు సమన్వయంలో సంవర్ధవంతంగా పని చేశారన్నారు. కలెక్టరేట్ పరిపాలన అధికారి హెచ్ఎస్ చంద్రశేఖర్, డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావు, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, సూపరింటెండెంట్ రవికుమార్, కో ఆర్డినేషన్ సెక్షన్ డిప్యూటీ తహసీల్దార్ ఎం.సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

డీఎన్నార్‌లో నూతన స్టేషనరీ షాపు ప్రారంభం

భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి) : డీఎన్నార్ విద్యా సంస్థలలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలు, రికార్డులు వివిధ రకాల స్టేషనరీ సామగ్రి తమ ఆవరణలోనే అందుబాటులో ఉంటుందని కళాశాల అధ్యక్షులు జీవీ నరసింహరాజు తెలిపారు. కళాశాల ఆవరణలో డీఎన్నార్ స్టేషనరీ షాపును పాలకవర్గ అధ్యక్షులు జి.నరసింహరాజు సోమవారం ప్రారంభించారు. కార్యదర్శి జి.సత్యనారాయణరాజు సేల్స్ కౌంటర్ ప్రారంభించారు. పాలకవర్గ సంయుక్తకార్యదర్శి కె.రామకృష్ణంరాజు, ప్రిన్సిపాల్ జి.మోజెస్, డీఎన్నార్ విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

నరసాపురం రూరల్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): రాజుగారితోట, సీతారాంపురం, కొప్పర్రు, వేములదీవి గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనుల్ని సోమవారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేశారు. క్వాలిటీ కంట్రోల్ డీఈ రఘుపతిరాజు, ఏఈ విశ్వనాథరాజు, సీఆర్‌ఐ డీఈ సత్యనారాయణరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో వేసిన సీసీ రహదార్లు ఎన్ని మీటర్లు రహదారి, నాణ్యత, నిబంధనల ప్రకారం పనులు చేపట్టారన్న దానిపై క్వాలిటీ అధికారులు పరిశీలించారు. ఏఈ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల చదరంగ పోటీలలో ప్రతిభ

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ పరిధిలోని అంతర్ జిల్లా కళాశాలల చదరంగ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించినట్టు చాంబర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. భీమవరం బీవీ రాజు డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన పోటీల్లో టి.గగన, ఎం. ప్రసన్న, ఆర్ఎల్ హర్షిత, ఈఎస్ఎస్ సాత్విక, కేవీఎస్ సూర్యప్రియ పాల్గొన్నట్టు తెలిపారు. విజేతలకు యూనివర్శిటీ రిజిస్ట్రారు ప్రొఫెసర్ జి.సుధాకర్ బహుమతులు అందజేశారని ప్రిన్సిపాల్ తెలిపారు. విజేతలను కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహారావు, అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ ఏబీఎస్ మూర్తి, ఎన్.సీతారామారావు, పీడీ, అధ్యాపకులు అభినందించారు.

డీఎస్పీగా డాక్టర్ శ్రీవేద

నరసాపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి); నరసాపురం డీఎస్పీగా డాక్టర్ శ్రీవేదను నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె 2022 బ్యాచ్‌కు చెందిన అధికారి. ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్నారు. తొలి పోస్టింగ్ ఇదేనని సమాచారం. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న డాక్టర్ మురళీకృష్ణకు ఇటీవల అదనపు ఎస్పీగా పదోన్నత లభించింది. అయితే ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకపోవడంతో అప్పటి నుంచి ఇక్కడే పని చేస్తున్నారు. తాజా ఉత్తర్వులోనూ అయనకు పోస్టింగ్ చూపించలేదు. ఎక్కడ రిపోర్టు చేయాలన్న విషయాన్ని కూడా తెలపలేదు.

తాడేపల్లిగూడెం ఆర్డీవోగా ఖతీబ్ కౌసర్‌బానో

భీమవరం టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం ఆర్డీవోగా ఖతీబ్ కౌసర్‌బానో సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈమె అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం డివిజన్ ఆర్డీవోగా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో తాడేపల్లిగూడెం డివిజన్‌కు వచ్చారు. కలెక్టర్ నాగరాణిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

గౌరీదేవి ఉత్సవాలు ప్రారంభం



పెంటపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వెలమ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే గౌరీదేవి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొడు గౌరీదేవిని మేళతాళాలు, గరగ నృత్యాలతో తోడ్కొని వచ్చి ఆలయంలో ప్రతిష్ఠించారు. కార్తీక పౌర్ణమి రోజున అమ్మవారి ఊరేగింపు జరుగుతుందని అప్పటి వరకూ ప్రతి రోజు ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమం ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తామని సంఘ సభ్యులు తెలిపారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

పార్టీ ఆదేశాలను పాటించాలి

పెంటపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. పెంటపాడులో మండల అధ్యక్షుడు కె.వెంకట్రావు అధ్యక్షతన సోమవారం జరిగిన మండల స్థాయి సమావేశంలో ఆయనకు పలువురు కార్యకర్తలు తమ ఆవేదనను చెప్పుకున్నారు. తిరుమల శ్రీవారి దర్శనానికి టీడీపీ శ్రేణులకు సిఫార్సు లెటర్ కూడా ఇవ్వడం లేదని వాపోయారు. బాబ్జి మాట్లాడుతూ సంయమనం పాటించాలన్నారు. డి.అప్పన్న, కె.బాబు, పి.రాంప్రసాద్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

ఆచంట, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్దుబాటు చార్జీలు పేరుతో ప్రజలపై మోపుతున్న రూ. 20 వేల కోట్ల భారాన్ని రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల కార్యాలయంలో సోమవారం సీపీఎం మండల కమిటీ సమావేశం ఎస్.నరసింహమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. కె.గోపాలన్, ఎస్‌వీఎస్ శర్మ, కె.జయరాజు, మోహనరావు పాల్గొన్నారు.